ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 20 ఏప్రిల్ 2024



జిల్లాలోకి జగన్ బస్సు యాత్ర


కాకినాడ జిల్లా నుంచి పాయకరావుపేట వద్ద ప్రవేశం

- వై జంక్షన్‌లో నేతలు స్వాగతం
- అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం
- నక్కపల్లి మండలం గొడిచెర్లలో రాత్రి బస
- నేడు కశింకోట మండలం గొబ్బూరులో బహిరంగ సభ
- రాత్రికి అనకాపల్లి మండలం చిన్నయ్యపాలెం వద్ద బస

పాయకరావుపేట, ఏప్రిల్ 19: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర శుక్రవారం రాత్రి పాయకరావుపేట వద్ద కాకినాడ జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాలోకి ప్రవేశించింది. తుని నుంచి జాతీయ రహదారి మీదుగా పాయకరావుపేట వద్ద తాండవ జంక్షన్ వరకు బస్సులోపల వున్న ఆయన అక్కడి నుంచి వాహనంపైకి ఎక్కి అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. వై జంక్షన్ వద్ద వైసీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎంపీ కె.సత్యవతి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్సీ డీవీ.సూర్యనారాయణరాజు తదితరులు స్వాగతం పలికారు. జగన్మోహన్‌రెడ్డి మళ్లీ బస్సు లోపలికి వెళ్లి, ముందు సీట్లో కూర్చుని ప్రజలకు అభివాదం చేసుకుంటూ నక్కపల్లి మండలంలోకి ప్రవేశించారు.

గొడిచెర్లలో రాత్రి బసకు చేరుకున్న జగన్

నక్కపల్లి, ఏప్రిల్ 19: వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి 9.30 గంటలకు నక్కపల్లి మండలం గొడిచెర్ల చేరుకున్నారు. ఇక్కడ జాతీయ రహదారి పక్కన ఖాళీ పొలంలో బస ... మిగతా 8వ పేజీలో



పాయకరావుపేటలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి

నేత్రపర్వంగా అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవం



స్వామివారి కల్యాణంలో భాగంగా జీలకర్ర, బెల్లం చూపిస్తున్న అర్చక స్వాములు

సింహాచల వరాహలక్ష్మీ నృసింహుని వార్షిక తిరు కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి 11 గంటల తరువాత వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆలయ ఆస్థాన మండపంలో కల్యాణోత్సవానికి ప్రారంభ శుభ సూచకగా జరిగే కొట్నాల ఉత్సవం జరిపారు. అనంతరం ఎదురు సన్నాహం, రథోత్సవాన్ని నిర్వహించారు. ఆ తరువాత కల్యాణ వేదికపై స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

.... వార్త 6వ పేజీలో

నిప్పుల కొలిమి!

కొనసాగుతున్న భానుడి భగభగలు!

- 11 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు
- రావికమతంలో 43.5 డిగ్రీలు నమోదు



నిర్మానుష్యంగా ఉన్న పరవాడ ప్రధాన రహదారి

అనకాపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపంతో శుక్రవారం కూడా జిల్లా మొత్తం నిప్పుల కొలిమిలా మారింది. అత్యధిక మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైబడే నమోదవుతున్నాయి. దాదాపు వారం రోజుల నుంచి కొంచెం అటుఇటుగా ఇదే వాతావరణం కొనసాగుతున్నది. వేడి గాలులకు తోడు ఉక్కపోతతో జనం విలవిలలాడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, మంచాన పడివున్న రోగులు అల్లాడిపోతున్నారు. శుక్రవారం జిల్లాలోని 11 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మూడు మండలాల్లో వడగాడ్పులు వీశాయి. మధ్యాహ్నం సమయంలో తీవ్రఎండతోపాటు వడగాడ్పులు వీయడంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండచుర్రుమంటుండడంతో తప్పని సరైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావడంలేదు. ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఆరుబయట తిరిగే వారు నీరు ఎక్కువగా సేవించాలని, గొడుగులు లేదా టోపీలు ధరించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కాగా జిల్లాలో శుక్రవారం రావికమతం మండలంలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన మండలాలను పరిశీలిస్తే... చీడికాడలో 43.1 డిగ్రీలు, చోడవరంలో 41.2, దేవరాపల్లిలో 43.1, గొలుగొండలో 41.5, కె.కోటపాడులో 41.1, కశింకోటలో 41.4, కోటవురట్లలో 41.4, మాడుగులలో 42.6, మాకవరపాలెంలో 41.4, రోలుగుంటలో 41.8, బుచ్చెయ్యపేటలో 40.5, నాతవరంలో 40.4, సబ్బవరంలో 39.7, అనకాపల్లిలో 38.7, అచ్యుతాపురంలో 36.4, మునగపాకలో 36, నక్కపల్లిలో 36.1, నర్సీపట్నంలో 41.3, పరవాడలో 36.3, పాయకరావుపేటలో 37.2, రాంబిల్లిలో 34, ఎస్.రాయవరంలో 37, ఎలమంచిలిలో 36.7 డిగ్రీలు నమోదయ్యాయి.

పెరిగిన విమానయానం

- విశాఖ నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరంలో 25,00,654 మంది ప్రయాణం
- 2023-24లో 27,84,428
- 10.19 శాతం పెరిగిన ప్రయాణికులు
- వారం రోజుల్లో మలేషియా విమానం

- 6లో

జన కేతనం

- పట్నంపై టీడీపీ పట్టు
- 'పశ్చిమ' ఫలితం తేల్చేది వారే
- ఎన్నికల ఖర్చుపై డేగ కన్ను
- పెందుర్తిలో... ఒకసారే చాన్స్!

- 7లో

ఊపందుకున్న నామినేషన్లు

జిల్లాలో రెండో రోజు పది మంది దాఖలు

- లోక్‌సభకు 4, శాసనసభకు 6..
- నామినేషన్లు వేసిన అయ్యన్న, కొణతాల, కన్నబాబురాజు, పైలా

అనకాపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ ఊపందుకున్నది. రెండో రోజైన శుక్రవారం అనకాపల్లి లోక్‌సభ స్థానానికి నలుగురు, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టణ్‌శెట్టి ఒక ప్రకటన విడుదల చేశారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ (జనసేన) ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాహ్నవికి నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకుముందు అనకాపల్లి రింగురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి రింగురోడ్డు కూడలి, చిన్న నాలుగురోడ్ల జంక్షన్, నెహ్రూచౌక్ మీదుగా గుండాల జంక్షన్ వద్ద ఉన్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. నర్సీపట్నం నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి చింతకాయల అయ్యన్న పాత్రుడు (టీడీపీ) రిటర్నింగ్ అధికారి జయరామ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకుముందు శివపురంలోని ఆయన నివాసం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి ఐదు రోడ్ల కూడలి, కృష్ణాబజార్, అబీద్ సెంటర్ మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కాగా అనకాపల్లి ఎంపీ అభ్యర్థి (బీజేపీ) సీఎం రమేశ్ అయ్యన్న నామినేషన్ల దాఖలు ప్రక్రియలో పాల్గొన్నారు. ఎలమంచిలి నుంచి వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు రిటర్నింగ్ అధికారి మనోరమకు నామినేషన్ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ డాక్టర్ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు. మాడుగుల అసెంబ్లీ స్థానానికి పైలా ప్రసాదరావు (టీడీపీ), పైలా ఈవీఎస్ నాయుడు (టీడీపీ), కరణం తిరుపతిరావు (బీఎస్పీ) నామినేషన్లు వేశారు.

కాగా అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పెందుర్తి అసెంబ్లీ నుంచి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు తరపున ఆయన సోదరుడు వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు.



నర్సీపట్నం ఆర్‌వో జయరామ్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అయ్యన్నపాత్రుడు. పక్కన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప



అనకాపల్లి ఆర్‌వో జాహ్నవికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ

అనకాపల్లి ఎంపీ స్థానానికి..

అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి నర్సీపట్నం మునిసిపాలిటీ గొర్లివీధికి చెందిన గవిరెడ్డి రమ (స్వతంత్ర), అనకాపల్లి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన కొన గురవయ్య యాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), మునగపాక మండలం అనపర్తి గ్రామానికి చెందిన కర్రి విజయలక్ష్మి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), విశాఖపట్నంలోని గోపాలపట్నం ప్రాంతానికి చెందిన నమ్మి అప్పలరాజు (భారత చైతన్య యువజన పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు. వీరి నుంచి జిల్లా రిటర్నింగ్ అధికారి రవి పట్టన్‌శెట్టి నామినేషన్లు స్వీకరించారు. కాగా పాయకరావుపేట, చోడవరం నియోజకవర్గాలకు ఇంతవరకు ఒక్క నామినేషన్ కూడా పడలేదు.

అత్యంత దారుణంగా అనకాపల్లి- చోడవరం రోడ్డు

5 కి.మీ.లు గంటకు పైగా ప్రయాణం

- తుమ్మపాల నుంచి మామిడిపాలెం వరకు అడుగడుగునా గోతులు
- పలుచోట్ల ఆనవాళ్లు లేని బీటీ రోడ్డు
- గోతుల రోడ్డులో ఏ వాహనంలో వెళ్లినా.. ఒళ్లు హూనమే!
- ప్రమాదాల బారిన ద్విచక్ర వాహనదారులు
- కనీస నిర్వహణ పనులు చేపట్టని ఆర్‌అండ్‌బీ
- ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా నిధులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- మాటలకే పరిమితమైన మంత్రి అమర్‌నాథ్ హామీలు



దర్శినగర్ వద్ద ఆనవాళ్లు లేని తారురోడ్డు

తుమ్మపాల (అనకాపల్లి), ఏప్రిల్ 19: జిల్లా కేంద్రం నుంచి చోడవరం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ఛిద్రమైంది. ప్రధానంగా తుమ్మపాల నుంచి మామిడిపాలెం వరకు ఐదు కిలోమీటర్ల మేర అడుగడుగునా భారీ గోతులతో దారుణంగా తయారైంది. ఈ మార్గంలో ఏ వాహనంలో వెళ్లినాసరే.. ఒళ్లు హూనం అవుతున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలో వున్న అనకాపల్లి- చోడవరం రోడ్డుకు గత ఐదేళ్లలో నిర్వహణ పనులు చేపట్టలేదు. కనీసం గోతులను కూడా పూడ్చలేదు. దీంతో తుమ్మపాల నుంచి మామిడిపాలెం వరకు ఐదు కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి గంట సమయం పడుతున్నదని పలువురు వాహనదారులు వాపోతున్నారు.



బవులవాడ మలుపు వద్ద భారీ గొయ్యి

జిల్లాలో అనకాపల్లి- చోడవరం రహదారికి ఎంతో ప్రాధాన్యం వుంది. పాయకరావుపేట, ఎలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల ప్రజలు చోడవరం, మాడుగులతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, చుట్టుపక్కల మండలాలకు వెళ్లాలంటే ఈ మార్గంలోనే ప్రయాణించాలి. ప్రధానంగా అనకాపల్లి మండలంలోని తుమ్మపాల, మార్టూరు, మాకవరం, బవులవాడ, దిబ్బపాలెం, ఊడేరు, మామిడిపాలెం, పాపయ్యపాలెం, సంతపాలెం, కొండుపాలెం, వెంకుపాలెం, తదితర గ్రామాల నుంచి నిత్యం అధికం సంఖ్యలో ప్రజలు అనకాపల్లికి రాకపోకలు సాగిస్తుంటారు. మరోవైపు దాదాపు 80 శాతం రాయి క్వారీలు, స్టోన్ క్రషర్లు ఈ రోడ్డు పక్కనే వున్నాయి. ఇక రావికమతం, మాడుగుల మండలాల్లోని క్వారీల నుంచి భారీ గ్రానైట్ శిలల ట్రాలీలు చోడవరం మీదుగా అనకాపల్లి వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుని ఇతర ప్రాంతాలకు వెళుతుంటాయి. దీంతో అనకాపల్లి- చోడవరం రోడ్డులో వాహనాల రద్దీ అధికంగా వుంటున్నది. ఎంతో ప్రాధాన్యం వున్న ఈ రహదారి నిర్వహణను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. కనీసం గోతులు పూడ్చడానికి కూడా నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా అడుగుకో గొయ్యి, గజానికో గుంత ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. క్వారీలు, క్రషర్ల నుంచి రాళ్లు, మెటల్, బుగ్గి రవాణా చేసే లారీలు, గ్రానైట్ శిలలను తరలించే భారీ ట్రాలీల కారణంగా ఈ రోడ్డు మరింత దారుణంగా తయారైంది. ప్రధానంగా తుమ్మపాల నుంచి మామిడిపాలెం వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడ భారీ గోతులు ఏర్పడడంతో ప్రయాణికుల ఒళ్లు హూనం ... మిగతా 8వ పేజీలో

సింహాచలం దేవస్థానాన్ని కలెక్టర్ చేతిలో పెడితే ఎలా!?

గత ఏడాది ఉత్సవ నిర్వహణలో వైఫల్యానికి బాధ్యులు ఎవరు

- జాయింట్ కలెక్టర్ విచారణ నివేదిక ఏమైంది
- అసలు తప్పు ఎవరిదో చెప్పరా?, ఏమిటీ వైఖరి..?
- ఏడాదైనా బాధ్యులపై చర్యలు తీసుకోరా?
- ఇలాగైతే దేవస్థానానికి చెడ్డపేరు రాదా??
- దేవస్థానం స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీస్తున్నారా...
- ఏ కార్యక్రమం నిర్వహించినా కనీసం ధర్మకర్తకు సమాచారం ఇవ్వడం లేదు
- ఈవోకు అనువంశిక ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు లేఖ



అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సంలో స్వామివారికి హారతి ఇస్తున్న అశోక్‌గజపతిరాజు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సింహాచలేశుని చందనోత్సవం ఏర్పాట్లు, గత ఏడాది ఉత్సవ నిర్వహణలో వైఫల్యం, దానికి బాధ్యులు ఎవరు?...అనే అంశాలపై దేవస్థానం అనువంశిక ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు తాజాగా ఆలయ ఈఓకు ఓ లేఖ రాశారు. అందులో అనేక అంశాలను ప్రస్తావించి, ప్రశ్నించారు. దేవస్థానం స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, దాని ప్రత్యేకతను అధికారులు కాపాడాలని కోరారు. ప్రతి అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళుతున్నామని చెబుతున్నారని, ఆయన 'ఓకే' అంటే అమలు చేస్తామనే విధంగా వ్యవహరిస్తున్నారని, కలెక్టర్‌కు దేవస్థానంతో సంబంధం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

- గత ఏడాది చందనోత్సవం చాలా ఘోరంగా జరిగిందని, నిర్వహణలో అధికారులు విఫలమయ్యారని, దానిపై జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి నివేదిక పంపించారని, అది ఇంతవరకూ ఎందుకు తెప్పించలేదని ఈఓను ప్రశ్నించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే దేవస్థానానికి చెడ్డపేరు రాదా?...అని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తప్పులు ఎక్కడ జరిగాయో తెలుసుకొని, వాటిని తక్షణమే సవరించుకోకపోతే ఎలా?...అని ప్రశ్నించారు. వారు నివేదిక ఇచ్చినప్పుడే చేస్తామని ఎన్ని రోజులు కాలయాపన చేస్తారో చెప్పాలని కోరారు. గత ఏడాది తప్పులు చేసిన వారు మళ్లీ ఇప్పుడు అవే తప్పులు చేస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారో చెప్పాలన్నారు. తక్షణమే నివేదిక తెప్పించి, బాధ్యులపై ... మిగతా 8వ పేజీలో

ఎన్నికలు పారదర్శకంగా, స్వేచ్ఛగా జరగాలి

- పార్టీలు, అభ్యర్థుల ఖర్చుపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 19: రాష్ట్రంలో జరగనున్న సాధారణ ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణలతో పాటు వివిధ ఎన్నికల విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ సునిశితంగా మారుతున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించిందని తెలిపారు. రాజకీయంగా, ఎన్నికల వ్యయ పరంగా పరిస్థితులు సంక్లిష్టంగా ఉండవచ్చనని భావిస్తున్నట్టు చెప్పారు. ఇంతకు ముందు కంటే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేస్తున్న ఖర్చులు ఎక్కువగా కనిపిస్తున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా యంత్రాంగం సునిశిత దృష్టితో మెలుగుతూ ఎటువంటి అక్రమాలకు అవకాశం ఇవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల నోడల్ అధికారులు, పోలీసు, ఆదాయ పన్ను శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

అయ్యన్న ఆస్తులు రూ.21.8 కోట్లు

ఆయన పేరుతో 6.17 కోట్లు

- భార్య పద్మావతి పేరుతో రూ.15.63 కోట్లు
- అప్పులు 2.86 కోట్లు
- అయ్యన్నపాత్రుడు మీద 17 క్రిమినల్ కేసులు

నర్సీపట్నం, ఏప్రిల్ 19: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో తన భార్య పద్మావతి పేరు మీద ఉన్న ఆస్తులతో సహా ఆయన ఆస్తుల వివరాలను పేర్కొన్నారు. ఆయన పేరు మీద చరాస్తులు రూ.1,13,23,032 ఉండగా, స్థిరాస్తులు రూ.5,04,61,500 చూపించారు. స్థిర, చరాస్తులు కలిపి రూ.6,17,84,532 ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన భార్య పద్మావతి పేరుతో చరాస్తులు రూ.4,79,24,824, స్థిరాస్తులు రూ.10,84,63,200 ఉన్నట్టు అఫిడవిట్‌లో చూపించారు. రెండూ కలిపి రూ.15,63,88,024 ఉన్నట్టు వివరించారు. ఈ ఇద్దరివి కలిపి రూ.21,81,72,556 ఆస్తులు ఉన్నట్టు వెల్లడించారు. ఆయన భార్య పద్మావతి పేరు మీద వివిధ బ్యాంకుల నుంచి రూ.1,38,16,034, మరో ఐదుగురి వద్ద రూ.1,48,57,545 మొత్తం రూ.2,86,73,579 రుణాలు ఉన్నట్టు అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

ఆస్తుల వివరాలు ఇలా...

అయ్యన్నపాత్రుడు చరాస్తులు కింది బ్యాంకులో డిపాజిట్లు, షేర్లు, ఎల్‌ఐసీ బాండ్లు, రెండు వాహనాలు, వంద గ్రాముల బంగారం చూపించారు. విశాఖపట్నం సిరిపురంలో 115 చదరపు గజాల విస్తీర్ణంలో అపార్టుమెంట్, తాతల కాలం నుంచి వచ్చిన నివాస గృహాలలో నాలుగో వంతు భాగం ఆస్తి కింద చూపించారు. అదే విధంగా గబ్బాడ, అల్లిపూడి, నర్సీపట్నం, పెదబొడ్డేపల్లి, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలో భూములు చూపించారు. భార్య పద్మావతి పేరు మీద వెయ్యి గ్రాముల బంగారం, నాలుగు కిలోల వెండి, చిట్స్, కారు, బ్యాంకులో డిపాజిట్లు, షేర్లు, ఎల్‌ఐసీ బాండ్లు ఉన్నట్టు పేర్కొన్నారు. చిడిగుమ్మల, నర్సీపట్నంలలో వ్యవసాయ భూములు, పెదబొడ్డేపల్లి, నర్సీపట్నంలలో ప్లాట్లు, తెలంగాణలో అపార్టుమెంట్‌లో 50 శాతం వాటా, బలిఘట్టంలో షాపింగ్ కాంప్లెక్స్, పెదబొడ్డేపల్లిలో కమర్షియల్ బిల్డింగ్, విశాఖపట్నం రామ్‌నగర్‌లో ఒక అపార్టుమెంట్ ఉన్నట్టు వివరించారు. నివాస భవనాలు వివరాలు వెల్లడించారు.

17 క్రిమినల్ కేసులు

అయ్యన్నపాత్రుడు మీద 17 క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు సుచరిత, రోజాలను దూషించినందుకు, సోషల్ మీడియాలో రెండు వర్గాల మధ్య విభేదాలు రేకెత్తించే విధంగా పోస్టులు పెట్టినందుకు, కోవిడ్ నిబంధనలు అతిక్రమణలో ఆయన పై పోలీసులు క్రిమినల్ కేసులు పెట్టారు. అదే విధంగా ఇంటి నిర్మాణంలో ఎన్‌టీసీ ఫోర్జరీ తదితర వివాదాలపై 17 కేసులు ఉన్నట్టు పేర్కొన్నారు.

కన్నబాబురాజు ఆస్తుల విలువ రూ.58.28 కోట్లు

- అప్పులు రూ.15.43 కోట్లు
- కారు లేదు
- ఒక్క క్రిమినల్ కేసు లేదు

ఎలమంచిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) తనకు ఆస్తులు రూ.58.28 కోట్లు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో చూపారు. అప్పులు రూ.15.43 కోట్లుగా వెల్లడించారు. అయితే ఆయన పేరున సొంత కారు కూడా లేదని పేర్కొనడం విశేషం. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన ఆయన ఎన్నికల అధికారి మనోరమకు సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పుల వివరాలు తెలిపారు. కన్నబాబురాజు పేరున పేరున చరాస్తి రూ.16.05 కోట్లు, స్థిరాస్తి రూ.20.67 కోట్లుగా చూపారు. ఆయన సతీమణి రాధాదేవి పేరున చరాస్తి రూ.6.39 కోట్లు, స్థిరాస్తి రూ.8.17 కోట్లుగా పేర్కొన్నారు. కన్నబాబురాజు అప్పులు రూ.12.21 కోట్లు కాగా ఆయన సతీమణి పేరున రూ.3.22 కోట్లు అప్పులున్నట్టు తెలిపారు. సతీమణి వద్ద రూ.43 వేలు చేతిలో నగదు ఉన్నట్టు పేర్కొన్నారు. ఆయన వద్ద రూ.22 వేలు నగదు ఉన్నట్టు తెలిపారు. డిపాజిట్లు రూపంలో ఆయన పేరున రూ.51.71 లక్షలు, సతీమణి పేరున రూ.2.15 లక్షలు ఉన్నాయని పేర్కొన్నారు. బాండ్లు, షేర్లు కలిపి కన్నబాబురాజు పేరున రూ.14.59 కోట్లు, సతీమణి పేరున రూ.36.70 లక్షలు ఉన్నట్టు తెలిపారు. పెట్టుబడుల కింద రూ.10 లక్షలు పెట్టినట్టు పేర్కొన్నారు. ఆస్తుల కొనుగోలుకు అడ్వాన్సుగా రూ.26.66 లక్షలు ఆయన, సతీమణి రూ.5.57 కోట్లు ఇచ్చినట్లు చూపారు. కన్నబాబు వద్ద రూ.10 లక్షలు విలువైన వజ్రపు ఉంగరం, రూ.47.83 లక్షలు విలువైన బంగారం ఉన్నట్టు తెలిపారు. ఆయన సతీమణి వద్ద రూ.42.5 లక్షలు విలువైన 1,580 గ్రాముల బంగారం ఉందని పేర్కొన్నారు. కన్నబాబురాజు పేరున ఎండాడలో 1500 గజాల స్థలం ఉందని తెలిపారు. దీని విలువ రూ.4.67 కోట్లుగా పేర్కొన్నారు. రెండవ కుమారుడు ఉప్పలపాటి సీతారామరాజు పేరున ఒక్క రూపాయి కూడా ఆస్తి లేదని చూపారు. కన్నబాబురాజుపై ఒక్క క్రిమినల్ కేసు లేదని స్పష్టం చేశారు. కన్నబాబురాజు వద్ద ఖరీదైన 3 కార్లు ఉన్నా ఒకటి కూడా ఆయన పేరున లేవని అఫిడవిట్‌లో పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

కొణతాల రామకృష్ణ ఆస్తులు రూ.63.95 కోట్లు

- ఆయన పేరు మీద రూ.58,97,53,200
- ఇద్దరు కుమార్తెల పేరిట స్థిరాస్తి రూ.2,26,28,000
- ఇద్దరు కుమార్తెల పేరిట చరాస్తి రూ.1,50,77,133
- అప్పులు రూ.2,07,15,830 కోట్లు

కొత్తూరు, ఏప్రిల్ 19: జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆస్తులు రూ.63.95 కోట్లు చూపించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాహ్నవికి అందజేసిన అఫిడవిట్‌లో ఈ మేరకు వివరాలు పొందుపరిచారు. ఆయన సమర్పించిన అఫిడవిట్ పత్రాల్లో ఇద్దరి కుమార్తెల పేరున ఉన్న ఆస్తులు, అప్పుల వివరాల ధ్రువపత్రాలు అందజేశారు. ఇద్దరి కుమార్తెల పేరిట స్థిరాస్తి రూ.2.26.28,000 కోట్లు, చరాస్తి రూ.1.50.77.133కోట్లు చూపించారు.

లక్ష్మీనరసింహ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో రుణాలు

లక్ష్మీ నరసింహ ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో 2020లో రూ.10లక్షలు, 2022లో రూ.36,35,830లక్షలు, మరోసారి రూ.36,80,000లక్షలు, 2020లో 12లక్షలు, కుమార్తె లక్ష్మీసుష్మ పేరుతో రూ.1 కోటి 12లక్షలు లోన్ తీసుకున్నారు. రామకృష్ణ పేరుపై ఎటువంటి వాహనాలు లేనట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

ఆస్తుల వివరాలు

కొణతాల రామకృష్ణ చరాస్తుల కింద వివిధ బ్యాంకుల్లో డిపాజిట్లు, తన ఇద్దరి కుమార్తెల పేర్లతో విశాఖపట్నం పలు బ్యాంకుల్లో ఉన్నట్టు చూపించారు. తన పేరుతో 22 క్యారెక్టర్ల బంగారం 224 గ్రాములు, 800 గ్రాములు సిల్వర్, ఇద్దరు కుమార్తెల పేరుతో 22 క్యారెక్టర్ల గోల్డు 448 గ్రాముల బంగారం, 1600 గ్రాముల సిల్వర్ ఉన్నట్టు చూపించారు.

రూ.10 లక్షలతో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పరారీ

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నగర పరిధి మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంజనీ విష్ణు అల్లియాడ్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ సంస్థకు చెల్లించాల్సిన రూ.10 లక్షలతో ఉడాయించాడు. దీనిపై సంస్థ యజమానులు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. అంజనీ విష్ణు అల్లియాడ్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ టైల్స్ సరఫరా చేస్తుంది. ఈ సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ స్థానికంగా డీలర్స్ నుంచి ఆర్డర్స్ తీసుకుని కంపెనీకి ఆర్డర్ పెడుతుంటాడు. ఆర్డర్ తీసుకునే సంస్థల నుంచి తెచ్చిన మొత్తాన్ని సంస్థకు చెల్లించాలి. అయితే శ్రీనివాస్ డీలర్ చెల్లించిన రూ.10 లక్షలను తన ఖాతాలో వేసుకుని పరారయ్యాడు. దీనిపై సంస్థ ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శిథిలావస్థలో పశువైద్య కేంద్ర భవనం

- రాచపల్లిలో ఇబ్బందుల నడుమ సిబ్బంది విధులు
- శ్లాబ్ నుంచి ఊడి పడుతున్న పెచ్చులు
- వర్షాకాలంలో తడిసిపోతున్న మందులు
- నూతన భవనానికి నిధుల కోసం పాడి రైతులు వినతి



శిథిలావస్థలో ఉన్న పశువైద్య కేంద్ర భవనం



శ్లాబ్‌కు పెచ్చులూడిన దృశ్యం

మాకవరపాలెం, ఏప్రిల్ 19: మండలంలోని రాచపల్లి పశువైద్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో సిబ్బంది భయపడుతూ విధులను నిర్వహిస్తున్నారు. ఈ పశువైద్య కేంద్రానికి ధర్మవరం, తామరం, ఎరకన్నపాలెం, కొత్తపాలెం, జి.వెంకటాపురం, సుబ్రహ్మణ్యపాలెం గ్రామాలకు చెందిన పశువులకు వైద్య సేవలు అందిస్తుంటారు. ఐదేళ్లుగా ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో పశువులకు వైద్య సేవలు సరిగా అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భవనంలో ఉన్న మందులు వర్షం పడితే పూర్తిగా తడిసిపోతున్నాయి. దీనికి తోడు విధులు నిర్వహిస్తున్నప్పుడు శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. పలువురు పాడి రైతులు సైతం ఇదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు ఉచిత వ్యాక్సిన్ వేసేటప్పుడు వాక్సిన్‌ను భద్రపర్చేందుకు నానాపాట్లు పడుతున్నట్టు చెపుతున్నారు. ఈ భవనం దుస్థితి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా పట్టించుకునేవారు కరువయ్యారన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇక్కడి పశువైద్య శాలకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా పాడి రైతులు కోరుతున్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

కె.కోటపాడు, ఏప్రిల్ 19: గ్రామ వలంటీర్ల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. ఇందులో భాగంగా కె.కోటపాడు మండలంలోని గవరపాలెం, రొంగలనాయుడుపాలెం, గుల్లేపల్లి, మేడిచర్ల, పిండ్రంగి, చౌడువాడ-1, చౌడువాడ -2, పైడంపేట, సూదివలస, గొట్లం గ్రామాల్లో పనిచేస్తున్న 73 మంది వలంటీర్లు రాజీనామాలు చేసినట్టు ఎంపీడీవో ఎస్.అప్పలరాజు శుక్రవారం తెలిపారు. వీరంతా వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామాలు చేసినట్టు ఆయా పత్రాల్లో పేర్కొన్నట్టు చెప్పారు.

రావికమతం: మండలంలోని మేడివాడ, పి.పొన్నవోలు, కొమిర గ్రామాల్లో పనిచేస్తున్న వలంటీర్లు శుక్రవారం రాజీనామాలు చేశారు. మేడివాడలో 14 మంది వలంటీర్లు ఎంపీడీవో భానోజీరావుకు రాజీనామాలు సమర్పించగా, పి.పొన్నవోలులో 12 మంది, కొమిరలో నలుగురు వలంటీర్లు డిజిటల్ అసిస్టెంట్ చిరంజీవికి, రామయ్యకు రాజీనామాలను అందజేశారు.

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేటలో ముగ్గురు, ఎం.అలమండలో పదిమంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఆయా పత్రాలను గ్రామ సచివాలయ కార్యదర్శులకు అందజేశారు.

మరిడి మహాలక్ష్మి ఆభరణాలు అప్పగింత

- దేవదాయ శాఖ ఏసీ సమక్షంలో అందించిన సన్యాసిపాత్రుడు
- రెండేళ్ల తర్వాత హుండీ ఆదాయం లెక్కింపు



దేవదాయ శాఖ అధికారులకు మరిడి మహాలక్ష్మి ఆభరణాలను అప్పగిస్తున్న సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం, ఏప్రిల్ 19: పట్టణంలోని మరిడి మహాలక్ష్మి అమ్మవారి బంగారు, వెండి ఆభరణాలను దేవదాయ శాఖ అధికారులకు చింతకాయల సన్యాసిపాత్రుడు అప్పగించారు. శుక్రవారం ఆలయంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆభరణాల తనిఖీ విభాగం అధికారిణి దుర్గాభవానీ, కార్యనిర్వాహక అధికారి గంగారావు, మునిసిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పచ్చిగోళ్ల ఈశ్వరావు తదితరుల సమక్షంలో సన్యాసిపాత్రుడు నగలను అప్పగించి రశీదు తీసుకున్నారు. ఆయా నగలను అధికారులు తూకం వేశారు. ఐదు వందల పది గ్రాముల బంగారం, ఐదున్నర కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్టు సన్యాసిపాత్రుడు తెలిపారు.

ఇదిలావుంటే, దేవదాయ శాఖ అధికారులు మరిడి మహాలక్ష్మి ఆలయంలోని హుండీ ఆదాయాన్ని రెండేళ్ల తర్వాత లెక్కించారు. 2022 ఆగస్టు రెండో తేదీన ఈ ఆలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నట్టు ప్రకటించారు. అప్పట్లో రెండు హుండీలకు సీల్ వేశారు. అప్పటి నుంచి హుండీల ఆదాయం లెక్కించ లేదు. శుక్రవారం తెరిచి ఆదాయం లెక్కించారు. రూ.2,53,738 వచ్చినట్టు కార్యనిర్వాహక అధికారి గంగారావు తెలిపారు. అమ్మవారి పేరు మీద బ్యాంక్ ఖాతా తెరిచి హుండీ ఆదాయం జమ చేశామన్నారు.

ఒక్క చాన్స్ ఇస్తే జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు

- ప్రచార సభలో కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ
- చోడవరం టీడీపీ అభ్యర్థి రాజుతో కలిసి రోలుగుంటలో రోడ్డు షో



రోలుగుంటలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

రోలుగుంట, ఏప్రిల్ 19 : ఒక్కసారి తనకు చాన్స్ ఇస్తే జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేష్ హామీ ఇచ్చారు. మండల కేంద్రం రోలుగుంటలో శుక్రవారం రాత్రి ఆయన రోడ్డు షో నిర్వహించారు. చోడవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి గ్రామ పురవీధుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం మంజూరు చేసిన పథకాలకు రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ స్టిక్కర్లు వేసుకుని తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుపై తనకు, సైకిల్ గుర్తుపై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. ఎంపీటీసీ రామకృష్ణ మాట్లాడుతూ తమ గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని, యువతకు ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని సీఎం రమేష్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, బీజేపీ మండల అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు, జనసేన మండల అధ్యక్షుడు బలిజి మహారాజు, స్థానిక ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ, సర్పంచ్ వరలక్ష్మి తదితరులతో పాటు మూడు పార్టీల శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

- వాద సంవాదాల నడుమ ఎదురు సన్నాహం
- హరి నామ స్మరణల నడుమ వైభవంగా రథోత్సవం
- ఉత్సవాల్లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి



ఎదురు సన్నాహం చేస్తున్న అర్చక స్వాములు

సింహాచలం, ఏప్రిల్ 19: వరాహలక్ష్మీనృసింహుని వార్షిక తిరు కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల హరి నామ స్మరణల నడుమ శుక్రవారం రాత్రి 11 గంటలకు పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణం నిర్వహించారు. ఏటా చైత్ర మాస శుక్ల పక్ష దశమి నుంచి ఏడు రోజుల పాటు స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, ప్రభాత ఆరాధనలు పూర్తి చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆలయ ఆస్థాన మండపంలో కల్యాణోత్సవానికి ప్రారంభ శుభ సూచకగా జరిగే కొట్నాల ఉత్సవం జరిపారు. అనంతరం ఆలయ ఈశాన్య భాగంలోని నూతన యాగశాలలో అగ్ని ప్రతిష్ఠాన చేసి విశేష హోమాలు నిర్వహించారు. ఎదురు సన్నాహం, రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

అంగరంగ వైభవంగా కల్యాణం

రథయాత్ర అనంతరం నృసింహ మండపం మధ్యలో వివిధ రకాల పరిమళభరిత పుష్పాలతో ఆలయ నమూనాలో తీర్చిదిద్దిన కల్యాణ వేదిక పైకి స్వామి, అమ్మవార్లను తొడ్కొని వచ్చారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు రమణాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహితులు కరి సీతారామాచార్యులు, తదితరులు పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ముడు కలశాలను ఉంచి పుణ్యాహవాచనము జరిపిన పవిత్ర జలాలతో కల్యాణ వేదికను, సంబరాలను, భక్తులను, అతిథులను, ఆలయ సిబ్బందిని ప్రోక్షణ చేశారు. కంకణ ధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ చేసిన తరువాత ప్రత్యేకంగా నేత కార్మికుల వద్ద కొనుగోలు చేసిన మధుపర్కాలను నూతన వధూవరులుకు సమర్పించారు. కన్యావరణలు, కన్యాదానం, పాదప్రక్షాళనం కార్యక్రమాలు జరిపిన తర్వాత భక్తుల హరినామ స్మరణ నడుమ జీలకర్రా బెల్లం స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ఉంచి, మాంగళ్యధారణ జరిపారు. ముత్యాలు కలిపిన తలంబ్రాలతో అక్షితారోపణము భక్తుల ఆనందోత్సాహాల నడమ వేడుకగా చేపట్టారు. కల్యాణోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులు, సీపీ రవిశంకర్ అయ్యన్నార్, శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర, ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర తిలకించారు. ఉత్సవం అనంతరం ప్రత్యేక కౌంటర్ల ద్వారా దేవాలయ సిబ్బంది ముత్యాల తలంబ్రాలను, లడ్డూ ప్రసాదాలను భక్తులందరికీ పంపిణీ చేశారు.

అదీప్‌రాజ్ ఆస్తుల వివరాలు

పెందుర్తి, ఏప్రిల్ 19: ప్రస్తుత ఎమ్మెల్యే, వైసీపీ పెందుర్తి నియోజకవర్గ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో భార్యాభర్తల పేరిట ఉన్న ఆస్తులు, అప్పుల వివరాలను అందజేశారు. అదీప్‌రాజ్ పేరు మీద చరాస్తులు రూ.2,11,22,608, స్థిరాస్తులు 2,01,69,650, ఇంప్రూవబుల్ ప్రాపర్టీ కింద రూ.1,33,02,500గా చూపారు. ఈ మూడు కలిపి రెండూ కలిపి రూ.5,45,94,758. ఆయన భార్య శిరీష పేరు మీద చరాస్తులు రూ.80,84,748, 70 గ్రాముల బంగారం..దీని విలువ రూ4.90 లక్షలు, స్థిరాస్తులు రూ.40,43,000గా చూపారు. ఈ మొత్తం కలిపి రూ.12,6,17,748. అదీప్‌రాజ్ అప్పులు కింద రూ.1,52,47,990 చూపించారు.

ప్రస్తుతం ఆయన చేతిలో రూ.94,500, శిరీష వద్ద రూ.54,000 ఉన్నట్టు పొందుపరిచారు. అలాగే అదీప్‌రాజ్‌కు పినగాడిలో మామ గిఫ్ట్‌గా ఇచ్చిన స్థలం 72,745 చదరపు గజాలు. ప్రస్తుతం దీని విలువ 4,84,86.800. శిరీష పేరిట రాంపురంలో రెండుచోట్ల 8,792 చదరపు గజాల స్థలం, రుషికొండలో అన్ డివైడెడ్ షేర్ ల్యాండ్ 439 చదరపు గజాలు ఉన్నట్టు చూపారు. అలాగే అదీప్‌రాజ్‌కు పినగాడి, అంతకాపల్లి, గొరపల్లిల్లో సుమారు ఆరెకరాలు ఉండగా, వీటి విలువ రూ.35 లక్షలుగా పేర్కొన్నారు. శిరీష పేరిట సుమారు 50 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది.

అదీప్‌రాజ్‌పై కేసులు

పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 402-2017, కొత్తవలస పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ సీ3సి-1242-2016 కేసులు, సీసీ 179-2018 ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ విశాఖ, సీసీ 293-2022 ఆరో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రైల్వే కోర్టు విశాఖలో కేసులు ఉన్నట్టు చూపారు.

పెరిగిన విమానయానం

- విశాఖ నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరంలో 25,00,654 మంది ప్రయాణం
- 2023-24లో 27,84,428
- 10.19 శాతం పెరిగిన ప్రయాణికులు
- వారం రోజుల్లో మలేషియా విమానం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం విమానాశ్రయం పురోభివృద్ధి సాధిస్తోంది. గత ఏడాది కాలంలో ప్రయాణికుల సంఖ్య 10.19 శాతం పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 25,00,654 మంది ప్రయాణం చేయగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 27,84,428కి పెరిగింది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 2,85,974 మంది ప్రయాణికులు పెరిగారు. అంటే సగటున నెలకు 23,831 మంది, రోజుకు 794 మంది అధికంగా ప్రయాణించారు. గత ఏడాది మే నెలలో అత్యధికంగా 2,90,182 మంది ప్రయాణించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో 1,91,189 మంది ప్రయాణించారు. వాస్తవానికి నవంబరు నుంచి మార్చి 31 వరకు రన్‌వే రీ సర్ఫేసింగ్ పనుల వల్ల రాత్రి 8 నుంచి ఉదయం 7 గంటల వరకు విమానాల రాకపోకలు రద్దు చేశారు. దాంతో పలు సర్వీసులు రద్దయ్యాయి. అందువల్ల ప్రయాణికుల సంఖ్య కొంత వరకు తగ్గింది. లేదంటే ఇంకా ఎక్కువ మంది ప్రయాణించి ఉండేవారని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నరేశ్‌కుమార్, కుమార్‌రాజా, వర్మలు తెలిపారు. అలాగే వారం రోజుల్లో మలేషియాకు అంతర్జాతీయ విమానం అందుబాటులోకి రానుందని చెప్పారు.

కొత్త సౌకర్యాలు

విమానాశ్రయంలో కొత్తగా ఇన్‌లైన్ బ్యాగేజ్ స్క్రీనింగ్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. అలాగే డిజి యాత్ర సర్వీసును ప్రారంభించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనివల్ల ప్రయాణికులకు నిరీక్షించే సమయం తగ్గుతుంది. ఆధార్ వెరిఫికేషన్ పనులన్నీ వేగవంతంగా పూర్తయి వెయిటింగ్ లాంజ్‌కి త్వరగా వెళ్లిపోవచ్చు.

30న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 30న నిర్వహించనున్నట్టు జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. ఎన్నికల నియమావళికి లోబడి సమావేశం జరుగుతుందన్నారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

వాకర్స్‌తో సీఎం రమేశ్ ఆత్మీయ కలయిక



ఎన్‌టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో వాకర్స్‌తో నడుస్తున్న సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 19: స్థానిక బెల్లం మార్కెట్ యార్డులో అనకాపల్లి వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ శుక్రవారం ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో కలిసి మార్కెట్ యార్డులో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ యార్డు అంతా నడుస్తూ వాకర్స్‌తో ముచ్చటించారు. రమేశ్ విజయానికి తామంతా కృషి చేస్తామని వాకర్స్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ.. అనకాపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేద్దామన్నారు. ఇక్కడున్న పాలకులు దోచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో వాకర్స్ ట్రాక్ లేకపోవడం ఆశ్చర్యకరమన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు డీడీ.నాయుడు మాట్లాడుతూ పట్టణానికి కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకురావాలని కోరగా సీఎం రమేశ్ స్పందిస్తూ కేంద్రం మంజూరు చేసిన కేవీని రాష్ట్ర ప్రభుత్వం, ఇక్కడి కొందరు నాయకులు పూర్తిగా అటకెక్కించారన్నారు. జిల్లాలో మూడు కేంద్రీయ విద్యాలయాలు తీసుకువచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడిలో వైసీపీ నుంచి జనసేనలో చేరికలు



వైసీపీ నుంచి వచ్చిన నాయకులకు జనసేన కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్న పంచకర్ల తదితరులు

పరవాడ, ఏప్రిల్ 19 : తాడి గ్రామానికి చెందిన 300 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేనలోకి చేరారు. ఈమేరకు తాడి గ్రామంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. జనసేనలోకి చేరిన వారిలో కోమటి సూరిబాబు, గనిరెడ్డి కనకరాజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, అనకాపల్లి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు పాల్గొన్నారు. అలాగే కలపాక పంచాయతీ పరిధి వైసీపీకి చెందిన పలువురు వార్డు మెంబర్లు , కార్యకర్తలు జనసేనలోకి చేరారు. వీరందరికీ పంచకర్ల ప్రసాద్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మోటూరి సన్యాసినాయుడు, నగిరెడ్డి చిన్నారావు, జనపాల రాము పాల్గొన్నారు.

వైసీపీలో చేరనున్న యర్రాపాత్రుడు

- ముచ్చటగా మూడోసారి...
- నేడు జగన్ సమక్షంలో తీర్థం

మాకవరపాలెం, ఏప్రిల్ 19: మండలంలో సీనియర్ రాజకీయ నాయకుడు, బూరుగుపాలెం ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు ముచ్చటగా మూడోసారి వైసీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే ఆయన పలు పార్టీలు మారారు. 2019లో అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరి, స్థానిక ఎన్నికల్లో అదే పార్టీ నుంచి బూరుగుపాలెం ఎంపీటీసీ పోటీచేసి గెలుపొందారు. ప్రస్తుతం ఆయన వైసీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు శనివారం తాళ్లపాలెం వద్ద జరిగే సీఎం జగన్ బస్సు యాత్రలో వైసీపీలో చేరనున్నారని సమాచారం.

విశాఖ- బెంగళూరు మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఏప్రిల్ 19: వేసవి ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, ఎస్ఎంవీ బెంగళూరు, మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 08549 నంబరు గల రైలు ఈనెల 27 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 1.15 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరిగి ఈనెల 28 నుంచి జూన్ 30వ తేదీ వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు ఉదయం 9.00 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు దువ్వాడ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కట్పాడి, జోలార్‌పెట్టాయి, కృష్ణరాజపురం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434



నర్సీపట్నం వ్యూ

పట్నంపై టీడీపీ పట్టు



అయ్యన్నపాత్రుడు

పార్టీ ఆవిర్భావం తరువాత తొమ్మిదిసార్లు ఎన్నికలు


మొత్తం ఓటర్లు	2,09,181
మహిళలు	1,07,567
పురుషులు	1,01,609
ఇతరులు	5

ఆరు పర్యాయాలు సైకిల్ హవా.. అయ్యన్నే విజేత

- ఏడు దశాబ్దాల క్రితం నర్సీపట్నం కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం
- 2019 వరకు 14సార్లు ఎన్నికల్లో
- ఆదిలో కాంగ్రెస్ పైచేయి... 1983 తరువాత తెలుగుదేశం ఆధిపత్యం
- ఇరు పార్టీలు చెరో ఆరుసార్లు గెలుపు
- స్వతంత్ర పార్టీ, వైసీసీకి ఒక్కోసారి ఛాన్స్
- వరుసగా పదోసారి పోటీ చేస్తున్న అయ్యన్నపాత్రుడు
- వైసీపీ నుంచి బరిలో ఎమ్మెల్యే పెట్ల గణేశ్
- గత ఎన్నికల్లో ముఖాముఖి.. ఈసారి బహుముఖ పోటీ?

దాదాపు ఏడు దశాబ్దాల చరిత్ర ఉన్న నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం 14 పర్యాయాలు ఎన్నికలు జరగ్గా తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు చెరో ఆరుసార్లు గెలుపొందాయి. ఒకసారి స్వతంత్ర పార్టీ, గత ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించాయి. రాష్ట్రం ఏర్పడిన తరువాత మూడు దశాబ్దాల వరకు కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం చెలాయించగా, 1983 నుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారింది. టీడీపీ ఆవిర్భావం తరువాత 2019 వరకు తొమ్మిదిసార్లు (ఉప ఎన్నిక కాకుండా) ఎన్నికలు జరగ్గా... ఆరు పర్యాయాలు తెలుగుదేశం పార్టీ గెలుపొంది రికార్డ్ సాధించింది. అంతేకాక 1983 నుంచి ఇప్పటి వరకు అన్ని ఎన్నికల్లో టీడీపీ తరఫున అయ్యన్నపాత్రుడు పోటీ చేయడం మరో అరుదైన రికార్డ్.

ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైన తరువాత నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటి మాదిరిలో అప్పట్లో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు రిజర్వుడ్ స్థానాలు ప్రత్యేకంగా వుండేవి కావు. జనరల్ స్థానాల్లోనే కొన్నింటిని ద్విసభ్య నియోజకవర్గాలుగా ఏర్పాటు చేశారు. వీటిలో నర్సీపట్నం కూడా వుంది. ఈ నియోజకవర్గం ఏర్పడిన తరువాత తొలిసారి 1955వ సంవత్సరంలో (ద్విసభ్య) ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున జనరల్ కేటగిరీలో పోటీ చేసిన రాజాసాగి సూర్యనారాయణరాజు 23,574 ఓట్లు, రిజర్వుడ్ కేటగిరీలో పోటీ చేసిన ముత్యాల పోతురాజు 21,346 ఓట్లుతో విజయం సాధించారు. తరువాత ద్విసభ్య నియోజకవర్గాల విధానాన్ని పార్లమెంటు చట్టం ద్వారా అప్పటి కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఎస్సీ, ఎస్టీ జనాభా ఆధారంగా కొన్ని నియోజకవర్గాలను ఈ కేటగిరీలకు రిజర్వు చేశారు. 1962లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి రుత్తల లత్సాపాత్రుడు, కాంగ్రెస్ అభ్యర్థి రాజాసాగి సూర్యనారాయణరాజుపై గెలుపొందారు. 1967 ఎన్నికల్లో మరోసారి వీరిద్దరి మధ్య పోటీ జరగ్గా.. ఈసారి సూర్యనారాయణరాజును విజయ లక్ష్మి వరించింది. 1972లో కూడా సూర్యనారాయణరాజు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, స్వతంత్ర బోళెం గోపాత్రుడుపై గెలుపొందారు. 1977 లోక్‌సభ ఎన్నికల్లో జనతా పార్టీ చేతిలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడం, తరువాత కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోవడంతో రాజాసాగి సూర్యనారాయణరాజు జనతా పార్టీలో చేరారు. 1978లో జరిగిన ఎన్నికల్లో బోళెం గోపాత్రుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి సూర్యనారాయణరాజును ఓడించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కృతురాలైన ఇందిరాగాంధీ.. కొత్తగా కాంగ్రెస్(ఐ) పార్టీని స్థాపించారు. ఈ పార్టీ తరఫున లాలం సత్తిబాబు పోటీ చేసి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు.



రాజాసాగి సూర్య నారాయణరాజు



ముత్యాల పోతురాజు




రుత్తల లత్సాపాత్రుడు



బోళెం గోపాత్రుడు

తెలుగుదేశం ఆవిర్భావం తరువాత..


తెలుగు సినిమా నటుడు నందమూరి తారక రామారావు 1982 మార్చిలో తెలుగుదేశం పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే రుత్తల లత్సాపాత్రుడు మనవడు (కుమార్తె కొడుకు) చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలుగుదేశం పార్టీలో చేరారు. 1983 జనవరిలో జరిగిన ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిసి రాజాసాగి రామచంద్రరాజును ఓడించి, పోటీ చేసిన తొలిసారే ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అప్పటికి ఆయన వయసు 25 ఏళ్లు! 1984లో నాదెండ్ల భాస్కరరావు తిరుగుబాటు తరువాత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు అసెంబ్లీని రద్దు చేయడంతో 1985లో మధ్యంతర ఎన్నికలు జరిగియి. టీడీపీ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసిన అయ్యన్నపాత్రుడు, కాంగ్రెస్ అభ్యర్థి వేచలపు శ్రీరామమూర్తిపై విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా రాజాసాగి కృష్ణమూర్తిరాజు, టీడీపీ అయ్య న్నపాత్రుడుపై గెలుపొందారు. అయ్యన్న హ్యాట్రిక్ విజయాన్ని త్రుటిలో కోల్పోయారు. మళ్లీ 1994లో జరిగిన ఎన్నికల్లో పాత ప్రత్యర్థులే తలపడ్డారు. ఈసారి విజయం అయ్యన్నపాత్రుడిని వరించింది. 1999 ఎన్నికల్లో అయ్యన్న వరుసగా ఐదోసారి పోటీ చేయగా, కాంగ్రెస్ పార్టీ నుంచి రాజాసాగి రామచంద్ర రాజు పోటీ చేశారు. ఈసారి కూడా అయ్యన్న పాత్రుడు గెలిచారు. 2004 ఎన్నికల్లో అయ్యన్న ఆరోసారి పోటీ చేశారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ డాక్టర్ పెట్ల రామచంద్రకు టికెట్ ఇచ్చింది. రాజాసాగి రామచంద్రరాజు సమీప బంధువు డీవీ సూర్యనారాయణరాజు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు.



రాజాసాగి కృష్ణమూర్తి రాజు



బోళెం ముత్యాలపాప



పెట్ల ఉమాశంకర్‌గణేశ్

ఒకసారి ఉప ఎన్నిక.. టీడీపీ గెలుపు

లోక్‌సభకు 1996లో జరిగిన ఎన్నికల్లో అప్పటికే ఎమ్మెల్యేగా వున్న అయ్యన్న పాత్రుడు అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో వేచలపు శ్రీరామ్మూర్తి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రాజాసాగి కృష్ణమూర్తిరాజుపై గెలుపొందారు.

ఆయనపై అయ్యన్నపాత్రుడు గెలుపొందగా, కాంగ్రెస్ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీఆర్‌ఎస్ పార్టీలో కూటమిగా ఏర్పడి పోటీ చేయడంతో తెలుగుదేశం పార్టీ ఓడిపోయింది. కానీ ఇక్కడ అయ్యన్న గెల వడం విశేషం. 2009 ఎన్నికల్లో బోళెం గోపాత్రుడు మనవరాలు బోళెం ముత్యాలపాప కాంగ్రెస్ తరఫున పోటీ చేసి, టీడీ పీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడుపై గెలుపొందారు. నర్సీపట్నం నుంచి తొలి మహిళ ఎమ్మెల్యేగా ఆమె రికార్డుల్లోకి ఎక్కారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి అయ్యన్నపాత్రుడు ఎనిమిదోసారి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి ఉమాశంకర్ గణేశ్‌పై విజయం సాధించారు. గత ఎన్నికల్లో వీరిద్దరి మధ్యనే పోటీ జరగ్గా... ఈసారి గణేశ్ గెలుపొందారు. వచ్చే నెలలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ నుంచి అయ్యన్నపాత్రుడు పదోసారి పోటీ చేస్తున్నారు. వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ బరిలో వున్నారు. కాంగ్రెస్, మరికొన్ని రాజకీయ పార్టీలు పోటీ చేయనున్నప్పటికీ ప్రధాన పోరు అయ్యన్న, గణేశ్‌ల మధ్యనే జరుగుతుందని చెప్పవచ్చు. ఈసారి విజయం ఎవరిని వరిస్తుం దో జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాలి.

● నర్సీపట్నం

నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం విజేతలు

సంవత్సరం	విజేత	పార్టీ	ఓట్లు	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఓట్లు	విజేత మెజారిటీ
1955	రాజా సాగి సూర్యనారాయణరాజు	కాంగ్రెస్	23,574	మండే పిచ్చయ్య	సీపీఐ	17,921	5,653
(ద్వి సభ్య)	ముత్యాల పోతురాజు	కాంగ్రెస్	21,346	పచ్చిపులుసు వీర్రాజు	సీపీఐ	16,532	4,814
1962	రుత్తల లత్సాపాత్రుడు	స్వతంత్ర పార్టీ	22,831	రాజాసాగి సూర్యనారాయణరాజు	కాంగ్రెస్	17,938	4,893
1967	రాజాసాగి సూర్యనారాయణరాజు	కాంగ్రెస్	36,038	రుత్తల లత్సాపాత్రుడు	స్వతంత్ర పార్టీ	21,190	14,848
1972	రాజా సాగి సూర్యనారాయణరాజు	కాంగ్రెస్	33,848	బోళెం గోపాత్రుడు	ఇండి.	22,896	10,953
1978	బోళెం గోపాత్రుడు	కాంగ్రెస్	40,209	రాజాసాగి సూర్యనారాయణరాజు	జనతా పార్టీ	31,649	8,560
1983	చింతకాయల అయ్యన్నపాత్రుడు	తెలుగుదేశం	38,490	రాజాసాగి రామచంద్రరాజు	కాంగ్రెస్	37,498	992
1985	చింతకాయల అయ్యన్నపాత్రుడు	తెలుగుదేశం	43,218	వేచలపు శ్రీరామమూర్తి	కాంగ్రెస్	42,407	811
1989	రాజాసాగి కృష్ణమూరిరాజు	కాంగ్రెస్	53,818	చింతకాయల అయ్యన్నపాత్రుడు	తెలుగుదేశం	42,863	10,955
1994	చింతకాయల అయ్యన్నపాత్రుడు	తెలుగుదేశం	62,385	రాజాసాగి కృష్ణమూర్తిరాజు	కాంగ్రెస్	41,206	21,179
1999	చింతకాయల అయ్యన్నపాత్రుడు	తెలుగుదేశం	59,853	రాజాసాగి రామచంద్రరాజు	కాంగ్రెస్	51,294	8,559
2004	చింతకాయల అయ్యన్నపాత్రుడు	తెలుగుదేశం	60,689	డీవీ సూర్యనారాయణరాజు	ఇండి.	36,759	23,930
2009	బోళెం ముత్యాలపాప	కాంగ్రెస్	65,465	చింతకాయల అయ్యన్నపాత్రుడు	తెలుగుదేశం	57,178	8,287
2014	చింతకాయల అయ్యన్నపాత్రుడు	తెలుగుదేశం	79,726	పెట్ల ఉమాశంకర్ గణేశ్	వైసీపీ	77,388	2,338
2019	పెట్ల ఉమాశంకర్ గణేశ్	వైసీపీ	93,818	చింతకాయల అయ్యన్నపాత్రుడు	తెలుగుదేశం	70,452	23,366

పెందుర్తిలో... ఒకసారే చాన్స్!

- నాలుగున్నర దశాబ్దాలుగా అదే తీరు
- రెండోసారి పోటీలో పంచకర్ల, అదీప్‌రాజ్
- ఆనవాయితీకి బ్రేక్ వేయనున్న 2024 ఎన్నికలు

రాష్ట్రంలో రెండు జిల్లాల పరిధిలోని ఒకటే నియోజకవర్గం... ఇలా రాజకీయాల్లో పెందుర్తి ప్రత్యేకత సంతరించుకుంది. గ్రామీణ, పట్టణ ప్రాంత ఓటర్లతో మిళితమైన ఇక్కడి ఓటర్ల తీర్పు విలక్షణమే. పెందుర్తి నుంచి ఏ పార్టీ అభ్యర్థి అయినా ఒకసారి మాత్రమే ఎమ్మెల్యేగా విజ యం సాధించారు. రెండోసారి రంగంలోకి దిగినా ఫలితం వ్యతిరేకమే. నియోజవర్గం ఏర్పడి నాలుగున్నర దశాబ్దాలు గడిచింది. అప్పటి నుంచి ఇక్కడ పోటీ చేసేవారికి ఒకసారే చాన్స్ అనే రికార్డుకు ఈ సారి బ్రేక్ పడనున్నది.




పెందుర్తి జంక్షన్

ఈ నియోజకవర్గం నుంచి తమ భవితవ్యం తేల్చుకునేందుకు రంగంలోకి దిగిన రెండు ప్రధాన పార్టీల నాయకులు రెండోసారి పోటీ చేస్తున్న వారే కావడంతో తరాలుగా వస్తున్న ఆనవాయితీకి బ్రేక్ పడే అవకాశాలే కనిపిస్తున్నాయి. పెందుర్తి నుంచి వైసీపీ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థిగా పంచకర్ల రమేశ్‌బాబు పోటీలో ఉన్నారు. 2009లో పంచకర్ల రమేశ్‌బాబు, 2019లో అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పెందుర్తి నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఈసారి వీరిలో ఎవరు విజయం సాధించినా రెండోసారి ఎన్నికైనట్టు అవుతుంది. దీంతో ఒకసారే చాన్స్‌కు బ్రేక్ పడుతుంది.

నియోజకవర్గ ప్రస్థానమిదీ...

నియోజకవర్గం ఏర్పడిన 1978లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన గుడివాడ అప్పన్న మరణంతో 1980లో జరిగిన ఉప ఎన్నికల్లో ద్రోణంరాజు సత్యనారాయణ స్వతంత్ర అభ్యర్థి పి.సింహాచలంపై విజయం సాధించారు. 1983లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పెతకంశెట్టి అప్పలనరసింహం చేతిలో ఓటమిపాలయ్యారు. పెతకంశెట్టికి అనకాపల్లి ఎంపీగా పోటీచేసే అవకాశం రావడంతో 1985శాసన సభ ఎన్నికల్లో పెందుర్తి నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆళ్ల రామచంద్రరావు పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా గుడివాడ గురునాథరావు పోటీచేసి టీడీపీ అభ్యర్థి పల్లా సింహాచలంపై గెలుపొందారు. ఆ తరువాత జరిగిన రాజకీయ సమీకరణాలతో సిట్టింగ్ ఎమ్మెల్యే గుడివాడ గురునాథరావు 1994లో విశాఖ 1 నుంచి పోటీచేయడంతో పెందుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ద్రోణంరాజు శ్రీనివాసరావు పోటీ చేశారు. టీడీపీ పొత్తుతో సీపీఐ అభ్యర్థిగా పోటీచేసిన మానం ఆంజనేయులు విజయం సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా పెందుర్తి నుంచి 1999లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన మానం ఆంజనేయులు మూడోస్థానానికి పరిమితమయ్యారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన పి.గణబాబు కాంగ్రెస్ అభ్యర్థి ద్రోణంరాజు శ్రీనివాస్‌పై విజయం సాధించారు. అప్పటివరకు కాంగ్రెస్‌లో ఉన్న గుడివాడ నాగమణి 2004లో పెందుర్తి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి, తిప్పల గురుమూర్తిరెడ్డిపై గెలుపొందారు. సిట్టింగ్ ఎమ్మెల్యే గణబాబుకు సీటు దక్కలేదు. నియోజకవర్గం పునర్విభజనలో 2009 జరిగిన పెందుర్తి శాసనసభ ఎన్నికల్లో పీఆర్పీ అభ్యర్థిగా పోటీచేసిన పంచకర్ల రమేశ్‌బాబు కాంగ్రెస్ అభ్యర్థి గండి బాబ్జీపై గెలిచారు. టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన బండారు మూడో స్థానానికి పరిమితమయ్యారు. తరువాత పీఆర్పీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో పంచకర్ల కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉండగా 2014 ఎన్నికల్లో ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బండారు సత్యనారాయణమూర్తి వైసీపీ అభ్యర్థి గండి బాబ్జీ పై గెలుపొందారు. మూడోసారి టీడీపీ అభ్యర్థిగా 2019లో రంగంలోకి దిగిన బండారు సత్యనారాయణమూర్తి రెండోసారి గెలుస్తారన్న అంచనాలకు భిన్నంగా వైసీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చేతిలో ఓటమి చెందారు. ఇలా నాలుగు దశాబ్దాలుగా జరిగిన శాసనసభ ఎన్నికల్లో పెందుర్తి నుంచి ఒకరికి ఒకసారి మాత్రమే ఎమ్మెల్యే అయ్యే చాన్స్ దక్కింది. ఈ సారి ఆ రికార్డు మరుగునపడనుంది.

● పెందుర్తి



మల్కాపురం వ్యూ

పశ్చిమ ఫలితం తేల్చేది వారే..

- పారిశ్రామిక ప్రాంత ఓటర్లే కీలకం
- నియోజకవర్గంలో ఉత్తరాది వారి ప్రాబల్యం

పశ్చిమ నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించేది పారిశ్రామిక ప్రాంత ఓటర్లే. ఈ ప్రాంతంలో ఏడు వార్డులున్నాయి. సుమారు లక్షమందికి పైగానే ఓటర్లు ఉంటారు. ఉత్తర భారతదేశానికి చెందిన వారితో పాటు శ్రీకాకుళం, విజయనగరం తదితర జిల్లాల నుంచి ఉపాధి కోసం వలస వచ్చిన ఓటర్లు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. వీరు ఏవరి వైపు మొగ్గుచూపితే వారికే విజయావకాశాలు పుష్కలంగా ఉంటాయి.

సాధారణంగా ఈ ఓటర్లకు ఏ రాజకీయపార్టీతోనూ సంబంధాలు ఉండవు. పోలింగ్ రోజు ఓటు వేయడానికి మాత్రమే వస్తారు. నేవీ క్వార్టర్స్‌లో నివసించే ఓటర్లు సాధారణంగా బయటకు రారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు ప్రతి ఎన్నికల్లో అభ్యర్థుల తరఫున నాయకులు గట్టి ప్రయత్నాలే చేస్తుంటారు. అయినప్పటికీ పెద్దగా ఫలితం కనిపించదు. పైగా ఈ పరిధిలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదవడానికి వీరు బయటకు రాకపోవడం కూడా కారణమే. తూర్పు నౌకాదళం ఉద్యోగులు, కోస్టు గార్డు ఉద్యోగులు, సింధియా, నౌసేనాబాగ్, యారాడ డాల్ఫిన్ హిల్, జై ఆంధ్ర కాలనీ, కాకరలోవ, క్రాంతినగర్, శ్రీహరిపురం ఎంబీజీ క్వార్టర్స్, ఆ పక్కనే ఉన్న కాలనీ, పిలకవానిపాలెం సమీప అన్నపూర్ణనగర్‌లో ఉత్తర భారతానికి చెందిన ఓటర్లున్నారు. మిగిలిన ప్రాంతాలలో శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశా ప్రాంతాల వారున్నారు. వీరంతా ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. ఈ ఓటర్లంతా ఎటువైపు మొగ్గుచూపితే విజయం వారినే వరిస్తుంటుంది. అంతేకాకుండా హెచ్‌పీసీఎల్, కోరమాండల్, బ్లాక్ ఆయిల్ కంపెనీ, బీపీసీఎల్, ఏపీసీఎల్, భూగర్భంలో గ్యాస్, చమురు నిల్వల ప్రాజక్టుల్లో పనిచేస్తున్న వారు సుమారు 60 శాతం మంది ఈ ప్రాంతంలో ఉన్నారు. వలస కూలీల సంఖ్య కూడా ఎక్కువే. పశ్చిమ నియోజకవర్గం డాక్‌యార్డు క్వార్టర్స్ (మేహాద్రిపేట) నుంచి జింక్ గేటు వరకు ఉంది. ఇక్కడ పోటీలోని అభ్యర్థులు విజయావకాశాలను నిర్ణయించే ఈ ఓటర్లపైనే ప్రత్యేకంగా దృష్టి సారించి, పోటాపోటీగా ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తుంటారు.

● మల్కాపురం

ఎన్నికల ఖర్చుపై డేగ కన్ను



ప్రచార ఆర్భాటంపైనా నిఘా

- ఖర్చు చేసిన ప్రతి రూపాయికీ లెక్క చెప్పాల్సిందే
- లేదంటే కఠిన చర్యలు తీసుకోనున్న ఈసీ

ఎన్నికలు సమీపించే కొద్దీ రాజకీయ పార్టీలు ప్రచారాన్ని కొత్తపుంతలు తొక్కిస్తాయి. గెలిస్తే చేయనున్న పనులు, హామీ లు, గతంలో నేరవేర్చిన వాగ్దానాలు, నినాదాలు తదితర అంశాలతో ప్రచార సామగ్రిని సిద్ధం చేస్తాయి. ఓటర్లను ఆకట్టుకుని తమ వైపునకు తిప్పుకోవడం దీని ఉద్దేశం. ఇందుకోసం కరపత్రాలు, గోడపత్రికలు, ఫ్లెక్సీలు ముద్రిస్తుంటారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రచారానికి సంబంధించిన ప్రచురణలకు కొన్ని మార్గదర్శకాలున్నాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముంది. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే ప్రచారం హోరెత్తుతోంది. ఆయా పార్టీల నేతలు రాష్ట్ర నాయకత్వం పంపిన ప్రచార సామగ్రితో పాటు స్థానికంగా సిద్ధంచేసిన వాటితోనూ రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో ప్రచురణలపై ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రత్యేక ఉత్తర్వులు ఇవి...

- పత్రికల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రత్యేకంగా ఏ అభ్యర్థి తరఫున అయినా ప్రకటనలు ఇచ్చేందుకు ముద్రించే వారి పేరు, ప్రచురణ కర్త, ముద్రించిన ప్రకటన ప్రతిని సమర్పించాలి.
- ముద్రణ పూర్తయ్యాక డిక్లరేషన్ ప్రతితో పాటు ముద్రించిన ప్రతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయాలి.
- జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా ఎన్నికల అధికారి అధ్యక్షతన ఏర్పాటవుతుంది. 2004 ఏప్రిల్ 13న సుప్రీంకోర్టు ఉత్తర్వులు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ప్రకారం ఈ కమిటీ నెలకొల్పారు. కమిటీ సభ్యులు స్థానిక వార్తా పత్రికలు, మ్యాగజైన్‌లు, కరపత్రాలు, గోడపత్రాలను పరిశీలిస్తారు.
- ఏ రాజకీయ పార్టీ నేత, అభ్యర్థి అయినా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా లేదా రెండూ విధించే అవకాశముంది.
- ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సంబంధించి రాత ప్రతులు, సీడీ రెండు కాపీలు కమిటీ ఆమోదం కోసం 72 గంటల ముందుగా సమర్పించాలి. ప్రకటన ప్రసారం చేయాలనుకుంటున్న వ్యక్తి పూర్తి సమాచారం అందులో ఉండాలి.
- ప్రకటనల తయారికి అయ్యే ఖర్చు, ప్రసార మాధ్యమాల్లో ప్రసారానికి అయ్యే ఖర్చు తెలపాలి.
- పోలింగ్ రోజు, అంతకుముందు రోజు ప్రింట్ మీడియాలో వచ్చే ప్రకటనలకు ఎంసీఎంసీ ఆమోదం తప్పనిసరి.
- పోటీచేసే అభ్యర్థి సామాజిక మాధ్యమ ఖాతా వివరాలను నామినేషన్ వెంట సమర్పించే ఫారం-26లో స్పష్టంగా పేర్కొనాలి.
- అభ్యర్థి లేకుండా ఇతర వ్యక్తులు ప్రకటనలు ఇస్తే అందుకు సంబంధించిన ప్రమాణ పత్రం దాఖలు చేయాలి.
- కుల, మతపరమైన ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు, ప్రలోభాలకు గురిచేయడం నిషేధం.
- రేడియో, ప్రైవేట్ ఎఫ్ఎం, టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియాపైనా పర్యవేక్షణ ఉంటుంది. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంటుంది.
- గోడపత్రాలు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ముద్రించే వ్యక్తి డిక్లరేషన్ తాలూకు రెండు ప్రతులను వ్యక్తిగతంగా తెలిసిన ఇద్దరి సంతకాలతో ప్రింటర్‌కు ఇవ్వాలి. డిక్లరేషన్ నమూనాను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నుంచి పొందాలి.

● ఉక్కు టౌన్‌షిప్



అందుబాటులో ఉండాలి



నిత్యం ప్రజలకు అందుబాటు ఉండే నాయకుడే కావాలి. సమర్థుడైన అభ్యర్థిని ఎన్నుకుంటేనే సమాజానికి మేలు. యువతకు ఉపాధి, పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయరంగం అభివృద్ధి, పేదవర్గాల అభ్యున్నతిపై చట్టసభల్లో మాట్లాడగలిగే నేతతో నియోజకవర్గం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. తాత్కాలిక తాయిలాలకు, ఇతర ప్రలోభాలకు తలొగ్గకుండా సమర్థునికి ఓటు వేయాలి. - రాంభట్ల ప్రసాదరావు, ప్రైవేటు ఉపాధ్యాయుడు, గోపాలపట్నం

నిజాయితీ గల నేతలను ఎన్నుకోవాలి



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో నిజాయితీ ఉన్న వారిని ఎన్నుకోవాలి. నోటికొచ్చిన హామీలు ఇచ్చి ఎన్నికల తరువాత కనిపించకుండా పోయే వారిని ఓటుద్వారా తిరస్కరించాలి. ప్రజా సమస్యలపై చట్టసభల్లో గళమెత్తగల నాయకుడు ప్రజా ప్రతినిధి అయితే సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయి. కుల,మత, రాజకీయపార్టీలను పక్కన పెట్టి సమస్యలపై సమర్థంగా పోరాడే సత్తాఉన్నవారిని చట్ట సభలకు పంపించాలి. ప్రలోభాలకు లొంగి అనర్హులకు ఓటు వేసి గెలిపిస్తే ఐదేళ్ల ఇబ్బందులు తప్పవు.

- మర్రి సూర్యనారాయణ, డాక్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగి, నరసింహనగర్

సమస్యలు తెలిసుండాలి



స్థానిక సమస్యలపై అవగాహన, పరిష్కరించే సత్తా ఉన్న వారికే ఓటు వేయాలి. స్వలాభంకోసం తాయిలాలు, ప్రలోభాలు ఎరచూపి, గెలిచిన తరువాత కనిపించకుండా పోయే వారిని ఎన్నుకుంటే ఓటుహక్కు వృథా అవుతుంది. ప్రజల మధ్యలో నిత్యం తిరిగే వారు ఎమ్మెల్యే, ఎంపీ అయితే వారిని నేరుకలిసి సమస్యలు వివరించే అవకాశం ఉంటుంది. అధికారంకోసం పోటీచేసిన అభ్యర్థులను తిరస్కరించాలి

- దొండపాటి నాగేశ్వరరావు, వ్యాపారి, సబ్బవరం

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243

ఎండలతో జనం బెంబేలు

▸ వడగాడ్పులు, ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు ఉక్కిరిబిక్కిరి... ▸ బయటకు రావడానికి సాహసించని జనం


అచ్యుతాపురంలో నిర్మానుష్యంగా ఉన్న సెజ్ రోడ్డు

పరవాడ, ఏప్రిల్ 19 : మండే ఎండలతో జనాలు బెంబేలెత్తుతున్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడిపోతున్నారు. మండల కేంద్రంలో శుక్రవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలకు తోడు వడగాడ్పులు వీయడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత తగ్గడం లేదు. దీని కారణంగా ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే పరవాడ-అనకాపల్లి ప్రధాన రహదారి శుక్రవారం బోసిపోయింది. అలాగే ఎండకు తోడు ఉక్కపోత ఎక్కువ కావడంతో వృద్ధులు, చిన్నపిల్లలు నానా అవస్థలు పడుతున్నారు.

కోటవురట్లలో.. రోజురోజుకు భానుడు భగభగమంటున్నాడు. గత నాలుగు రోజులుగా సూరీడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఎండకు తోడు వడగాడ్పులు వీయడంతో వృద్ధులు, పిల్లలు ఆపసోపాలు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే జనం రోడ్డుపైకి రావడానికి భయపడుతున్నారు. పగటి పూట ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలకు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శుక్రవారం ఉష్ణోగ్రత 37 డిగ్రీలు నమోదైంది. మధ్యాహ్న సమయాల్లో ప్రధాన రహదారులలో జనసంచారం లేక బోసిపోతున్నాయి.

అచ్యుతాపురంలో.. సూర్యుడు శుక్రవారం తన ప్రతాపాన్ని చూపాడు. ఉదయం ఏడు గంటల నుంచే మండిపోయాడు. తొమ్మిది గంటలకు చుర్రు మనిపించాడు. దీంతో ప్రజలు బయటకు రావడానికి భయపడ్డారు. ఉద్యోగులు, అత్యవసర పని ఉన్నవారు మాత్రమే బయటకు వచ్చారు. వైసీపీ నామినేషన్ల కార్యక్రమానికి వెళ్లిన వారంతా మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చి బయటకు రాలేదు. ఎండ తీవ్రతకు అచ్యుతాపురం, మోసయ్యపేటల్లో జరిగే వారపు సంత వెలవెల పోయింది. సాధారణ కొనుగోలుదారులు మాత్రం సాయంత్రం ఐదు దాటిన తర్వాత సంతలకు వెళ్లి వస్తువులు కొనుగోలు చేశారు. వాహనరాకపోకలతో ఎల్లవేళలా రద్దీగా ఉండే సెజ్ రోడ్డు ఉదయం పది గంటలనుంచి నిర్మానుష్యంగా మారింది.

అనకాపల్లి టౌన్‌లో.. జిల్లా కేంద్రంలో ఉష్ణోగ్రత స్థిరంగా కొనసాగుతున్నది. శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రత 38.3 డిగ్రీలు కాగా అత్యల్ప ఉష్ణోగ్రత 27.5 డిగ్రీలుగా నమోదైందని స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం నుంచి భానుడు భగభగమన్నా మధ్యాహ్నం మూడు గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


కోటవురట్ల జంక్షన్‌లో మండుటెండలో సైకిల్‌పై వెళుతున్న బాలికలు

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా..

▸ జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్

రాంబిల్లి, ఏప్రిల్ 19 : తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోకివాడ, మూలకొత్తూరు, నారాయణపురం, మామిడివాడ, చినకలవలాపల్లిల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఎలమంచిలి నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వైసీపీ పాలకులు మాత్రం అన్నివిధాల అభివృద్ధి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల పార్టీల అధ్యక్షులు వి.దినబాబు, పప్పల నూకన్నదొర, నాయకులు డ్రీమ్స్ నాయుడు, పొట్నూరి శివశంకర్, నీరుకొండ సూరిబాబు, ద్వారపురెడ్డి నానాజీ, శానాపతి దుబాయి పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి సహకరించండి

ఎలమంచిలి: రాష్ట్రాన్ని అభివృద్ధికి జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, టీడీపీ మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. శుక్రవారం రాత్రి మున్సిపాలిటి 17వ వార్డు రామ్‌నగర్, పడాల, సాయిబాబా వీధుల్లో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ రానున్నది ఎన్‌డీఏ ప్రభుత్వమని, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు గాజు గ్లాసు గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, టీడీపీ నేత కొటారు సాంబ, గొర్లె నానాజీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎలమంచిలి పట్టణంలో ప్రచారం చేస్తున్న సుందరపు

కోలాహలంగా 'కొణతాల' నామినేషన్

కొత్తూరు, ఏప్రిల్ 19: జనసేన అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ నామినేషన్ కార్యక్రమం శుక్రవారం కోలాహలంగా జరిగింది. తొలుత అనకాపల్లి రింగురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీతో బయలుదేరి చిన్న నాలుగురోడ్ల జంక్షన్, నెహ్రూచౌక్ కూడలి మీదుగా గుండాల జంక్షన్‌కు ర్యాలీ చేరుకుంది. అనంతరం 11.48 గంటలకు ఆర్వో జాహ్నవికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం కొణతాల విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ వేసేందుకు వచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తనకు గ్లాజుగ్లాస్ గుర్తు పైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, తనయుడు రిత్విక్, కూటమి నాయకులు పీలా గోవింద సత్యనారాయణ, బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, దాడి జయవీర్, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉగ్గిన రమణమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ర్యాలీగా వెళుతున్న కొణతాల రామకృష్ణ, కూటమి నాయకులు

నామినేషన్‌కు వెళితే మద్యం, బిర్యానీ, పెట్రోలు

అచ్యుతాపురం, ఏప్రిల్ 19: నామినేషన్ల సందర్భంగా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులతోపాటు కార్యకర్తలకు మందు, విందు సమకూరుతోంది. శుక్రవారం ఎలమంచిలి వైసీపీ అభ్యర్థి యూవీ రమణ మూర్తి రాజు నామినేషన్ సందర్భంగా భారీగా జనాలను తరలించారు. ఆటోలు, బైక్‌లపై వెళ్లే వారికి ఆయిల్ ఉచితంగా ఇచ్చారు. అంతేకాక ప్రతి వ్యక్తికి మందు కోసం 150 రూపాయలు, ఒక బిర్యానీ ప్యాకెట్ ఇచ్చారు. దీంతో నామినేషన్ కార్యక్రమంలో ముగిసిన వెంటనే వీరు వైన్ షాప్ బాట పట్టారు. 150 రూపాయలకు చీప్ లిక్కర్‌ను కొనుగోలు చేసి తాగారు. డబ్బులున్నవారు దీనికి అదనంగా తమ వద్ద డబ్బులు కలిపి అధిక ధర కలిగిన మద్యం కొనుగోలు చేశారు. దీంతో నామినేషన్‌కి వచ్చిన వారంతా ఆ పార్టీకి చెందిన వారే కాదని అర్థం అవుతోంది. అచ్యుతాపురంలో మద్యం షాపులు వైసీపీకి నామినేషన్ కార్యక్రమానికి వెళ్లి వచ్చిన వారితో నిండిపోయాయి.


వైసీపీ జెండా కట్టిన బైక్ వద్దే రోడ్డు మీద మద్యం తాగుతున్న వైసీపీ కార్యకర్తలు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

▸ ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, ఏప్రిల్ 19 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సింహాద్రి ఎన్టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. సింహాద్రి సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా లంకెలపాలెం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన రూరల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీజీఎం మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను నిరూపించుకునేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు చదువుకుంటూనే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. స్పోర్ట్స్ మీట్‌కు మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. విజేతలకు సీజీఎం చేతుల మీదుగా ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన సీఎస్ఆర్ అధికారులు, పాఠశాలల్లో హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

▸ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత


వమ్మవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, ఏప్రిల్ 19: రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి అనిత ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు సైకిల్ గుర్తుపైన, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో అనిత ఇంటింటికి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు యేజెర్ల వినోద్‌రాజు, ఎన్. వెంకటరాజు, పల్లెల జగ్గారావు, గుర్రం రామకృష్ణ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో వంద కుటుంబాలు చేరిక

మండలంలోని వమ్మవరంలో వైసీపీకి చెందిన వంద కుటుంబాలు శుక్రవారం టీడీపీలో చేరాయి. వైసీపీ నేత దోసపాత్రుని హనుమంతురావు (అంజి)తోపాటు వంద కుటుంబాల వారికి పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు.

జనసేనలో చేరికలు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 19 : నక్కపల్లి మండలం చిన్నదొడ్డిగల్లు గ్రామానికి చెందిన 20 కుటుంబాలు శుక్రవారం జనసేన పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా మండలంలోని గుంటపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు వెలగా సుధాకరరావు, మండల కార్యదర్శి తుమ్మల శ్యామ్‌కిషోర్, నాయకులు వీరబాబు, తూము రాజబాబు, శరణపు ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


ఆస్పత్రిలో డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 19 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అగ్నిమాపక శాఖ అధికారి బి. నరసింగరావు ఆధ్వర్యంలో పలుచోట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యాలయం, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందికి ప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధంగా నివారణ చర్యలు చేపట్టాలో డెమో ద్వారా వివరించారు. మాక్‌డ్రిల్ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శివయ్య కల్యాణోత్సవాలు ప్రారంభం

నక్కపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని ఉపమాక శివాలయంలో శుక్రవారం శివ పార్వతుల కల్యాణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ అర్చకులు మహేశ్, సంతోశ్, పండుశర్మ, భగవాన్‌శర్మ తదితరులు పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పల్లకీలో పార్వతీదేవి, సప్పరం వాహనంపై శివయ్య ఉత్సవమూర్తులను అలంకరించి, నక్కపల్లిలో మైలవరపు భట్ల జోగారావు ఇంటి వద్ద ఎదురుసన్నాహ మహోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి ఎంతో అద్భుతంగా ఆది దంపతుల పెండ్లి చూపులు, పెండ్లిమాటలు గురించి తెలియజేశారు. ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు నేతృత్వంలో కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో ఉపమాక దేవస్థానం ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు,అర్చకులు పీసపాటి శేషాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


నక్కపల్లిలో ఎదురు సన్నాహ మహోత్సవం జరిపిస్తున్న డాక్టర్ గాయత్రీదేవి

నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి

బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరి మాధవి

సబ్బవరం, ఏప్రిల్ 19 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే దేశంలో సుస్థిర అభివృద్ధి సాధ్యమని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరి మాధవి పేర్కొన్నారు. మండలంలోని అమృతపురం, తవ్వవానిపాలెం, ఎరుకునాయుడుపాలెం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను కలిసి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యేగా పంచకర్ల రమేశ్‌బాబుకు గ్లాసుగ్లాస్ గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాసులనాయుడు, కన్వీనర్ గొర్లి రామునాయుడు, నాయకురాలు జ్యోతి, ఉషారాణి పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సోదరి మాధవి

5 కి.మీ.లు.. గంటకుపైగా ప్రయాణం

... 5వ పేజీ తరువాయి

అవుతున్నది. వాహనాల టైర్లు, ఇతర విడిభాగాలు దెబ్బతింటున్నాయని యజమానులు వాపోతున్నారు. రాత్రి పూట ప్రయాణించేటప్పుడు దగ్గరకు వెళ్లే వరకు గోతులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కొద్దిపాటి దూరం ప్రయాణించడానికి గంటకు పైగా సమయం పడుతున్నదని ప్రజలు వాపోతున్నారు. కాగా తుమ్మపాల నుంచి చోడవరం మండలం వెంకన్నపాలెం జంక్షన్ వరకు రహదారిని అభివృద్ధి చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, ఆమ్ ఆద్మీ, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు గతంలో పలుమార్లు ఆందోళనలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేదు.

నీటిమూటలుగా మంత్రి అమర్ హామీ

అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రోడ్డును విస్తరించి, శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి చేస్తామని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పలుమార్లు హామీ ఇచ్చారు. మరికొద్ది రోజుల్లో ఆయన పదవీ కాలం ముగుస్తుంది. ఇప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అనకాపల్లి- చోడవరం రోడ్డు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఈ రోడ్డులో భారీ గోతులు ఏర్పడడంతో నానా అవస్థలు పడుతున్నాం. గోతుల కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించుకునే క్రమంలో పలువురు ప్రమాదాలబారిన పడ్డారు. ఐదు కిలోమీటర్లు ప్రయాణించడానికి గంటన్నర సమయం పడుతున్నది. ఎన్నికల తరువాత ఏర్పడే ప్రభుత్వం అయినా.. అనకాపల్లి నుంచి వెంకన్నపాలెం జంక్షన్ వరకు రహదారిని అభివృద్ధి చేయాలి.


ఒకవైపు మొత్తం ఛిద్రమైన రోడ్డు

జగన్ బస్సు యాత్ర

... 5వ పేజీ తరువాయి

చేసేందుకు (బస్సులోనే) ఏర్పాట్లు చేశారు.

నేడు గొబ్బూరులో బహిరంగ సభ

అనకాపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి శనివారం ఉదయం తొమ్మిది గంటలకు నక్కపల్లి మండలం గొడిచెర్ల నుంచి బస్సు యాత్రను కొనసాగిస్తారు. ఉద్దండపురం, నక్కపల్లి, పులపర్తి, రేగుపాలెం, ఎలమంచిలి బైపాస్ మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు అచ్యుతాపురం చేరుకుంటారు. మధ్యాహ్న భోజనం అనంతరం కశింకోట మండలం తాళ్లపాలెం సమీపంలో గొబ్బూరు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఇక్కడ ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొంటారు. తరువాత తాళ్లపాలెం జంక్షన్, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి, శంకరం, రేబాక మీదుగా అనకాపల్లి మండలం చిన్నయ్యపాలెం వద్ద రాత్రి బసకు చేరుకుంటారు.

సింహాచలం దేవస్థానాన్ని కలెక్టర్ చేతిలో పెడితే ఎలా!?

... 5వ పేజీ తరువాయి

ఉత్సవంలోగానే చర్యలు తీసుకోవాలని పరోక్షంగా సూచించారు. ఈ ఏడాది మే 10వ తేదీన నిర్వహించాల్సిన చందనోత్సవానికి సంబంధించి సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి, దాని తీర్మానాన్ని కలెక్టర్‌కు ఆమోదం కోసం పంపామని ఈఓ కార్యాలయం నుంచి తనకు లేఖ వచ్చిందని, ఏ చట్టం ప్రకారం కలెక్టర్‌కు పంపించారని అశోక్‌గజపతిరాజు ప్రశ్నించారు. ఆయన ఒప్పుకుంటేనే చర్యలు తీసుకోవాలనే నిబంధన ఎక్కడుందని ఆయన నిలదీశారు. దేవస్థానానికి స్వయం ప్రతిపత్తి ఉందని, దానిని తీసుకువెళ్లి కలెక్టర్ చేతిలో ఎలా పెడతారన్నారు. కలెక్టర్ సమయానుకూలంగా మంచి సూచనలు చేస్తే తీసుకోవడంలో తప్పు లేదని, కానీ ఆయన చెప్పేంత వరకు పనులు చేపట్టకుండా కూర్చొంటారా?, ఈలోగా పనులు చేయాల్సిన బాధ్యత మనకు లేదా?...అని ఆయన అడిగారు.

ఏ విషయమన్నా చెబుతున్నారా?

గత ఏడాది చందనోత్సవం వైఫల్యం సమీక్ష నుంచి ఇప్పటివరకు పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదని అశోక్‌గజపతిరాజు ఆరోపించారు. దేవస్థానానికి కమిటీ వేసినా, వేరే ఏ కార్యక్రమం చేసినా ధర్మకర్తకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు.

కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం గురించి చెప్పలేదని, అందులో తీసుకున్న నిర్ణయాలు కూడా తనకు తెలియజేయలేదన్నారు. ఇవన్నీ చూస్తుంటే...వరహాలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం స్వయం ప్రతిపత్తిని, కీర్తిని కావాలనే దెబ్బతీస్తున్నట్టుగా ఉందని, అలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

బీజేపీలో చేరిన నునపర్తి, దొప్పెర్ల సర్పంచులు


ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌తో నునపర్తి సర్పంచ్ అనూరాధ, అనుచరులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 19: మండలంలో వైసీపీకి చెందిన దొప్పెర్ల సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు, నునపర్తి సర్పంచ్ చుక్క అనూరాధ అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సమక్షంలో శుక్రవారం బీజేపీలో చేరారు. వారికి సీఎం రమేశ్ బీజేపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో సర్పంచులు తమ అనుచరులతో చేరారు. కార్యక్రమంలో టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, బీజేపీ ఎలమంచిలి ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు పాల్గొన్నారు.

గ్రామాల్లో మలేరియా నివారణ మందు స్ప్రేయింగ్

సబ్బవరం, ఏప్రిల్ 19: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం మలేరియా నివారణకు పీహెచ్‌సీ ప్రధాన వైద్యులు డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆల్ఫా సైపర్ మెత్రిన్ మందును స్ప్రెయింగ్ చేశారు. జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర మాట్లాడుతూ.. గత ఏడాది సబ్బవరం సచివాలయం-1 పరిధిలో మలేరియా కేసు నమోదైనందున ఈ ఏడాది కూడా అదే ప్రాంతంలో చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఐ.శ్రీనివాసు, ఎంపీహెచ్ఈవో కె.జేసుదాసు పాల్గొన్నారు.

22న మండల సర్వసభ్య సమావేశం

సబ్బవరం, ఏప్రిల్ 19: ఈనెల 22న మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రామ్మోహన్‌రావు తెలిపారు. మండల పరిషత్తు సమావేశం మందిరంలో ఉదయం 10 గంటలకు ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

ఉత్సాహంగా అటల్ టింకరింగ్ డే వేడుకలు

సబ్బవరం, ఏప్రిల్ 19: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో అటల్ టింకరింగ్ ల్యాబ్(ఎటీఎల్) వేడుకలు శుక్రవారం ఏటీఎల్ ఇన్‌చార్జి టి రాంబాబు ఆధ్వర్యంలో ఉత్సాహంగా జరిగాయి. కేజీబీవీ, ప్రభుత్వ హైస్కూల్, గురుకుల విద్యార్థులు తయారు చేసిన సాంకేతిక నమూనాలను ఎంఈవో బీఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ వీవీ సత్యారావు పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చిరంజీవి, జానకీరామ్, ప్రభాకర్, తిరుపతిరావు, మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బి.ఫారం అందుకున్న గంగాధర్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 19 : అనకాపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఐఆర్ గంగాధర్ బీ.ఫారంను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నుంచి గురువారం రాత్రి అందుకున్నారు. అనంతపురం జిల్లా పర్యటనలో ఉన్న షర్మిలను గురువారం రాత్రి కలవగా ఆమె నుంచి బి.ఫారాన్ని తీసుకున్నట్టు గంగాధర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 23న నామినేషన్ వేయడానికి సిద్ధమవుతున్నట్టు ఆయన తెలిపారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళి


లచ్చన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 19: స్థానిక జనసేన కార్యాలయంలో శుక్రవారం ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల పెన్నిధి సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి కార్యక్రమం జరిగింది. లచ్చన్న చిత్రపటానికి అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, జనసేన అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. లచ్చన్న సేవలను నేతలు కొనియాడారు.

వైసీపీ అభ్యర్థి కన్నబాబురాజు నామినేషన్ దాఖలు

ఎలమంచిలి, ఏప్రిల్ 19 : వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యూవీ.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ఎంపీ డాక్టర్ సత్యవతి, పార్టీ పరిశీలకులు జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మలతో కలిసి ఆర్‌వో మనోరమకు కన్నబాబురాజు నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకుముందు ఏటికొప్పాకలోని బండి మాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు బోదెపు గోవింద్, బొద్దపు ఎర్రయ్యదొర పాల్గొన్నారు.

జనసేనలో చేరిన గోకివాడ ఎంపీటీసీ సభ్యుడు

రాంబిల్లి, ఏప్రిల్ 19 : మండలంలోని గోకివాడ ఎంపీటీసీ సభ్యుడు అల్లవరపు నాగేశ్వరరావు (బాబ్జి)తన అనుచరులతో కలిసి గురువారం రాత్రి జనసేన పార్టీలో చేరారు. వారికి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ కండువాలు వేసి జనసేన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు

ఎలమంచిలి, ఏప్రిల్ 19: ఎలమంచిలికి చెందిన వైసీపీ శ్రేణులు శుక్రవారం జనసేన పార్టీలో చేరినట్టు జనసేన పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు బొద్దపు శ్రీను తెలిపారు. అచ్యుతాపురంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో వైసీపీకి చెందిన లంక రాజు, రామ్‌నగర్‌కు చెందిన కె.శ్రీనులతోపాటు మరికొంతమంది జనసేనలో చేరారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గొర్లె నానాజీ, జనసేన నేత కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలేయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ఎస్.రాయవరం, ఏప్రిల్ 19: వరల్డ్ లివర్ డే సందర్భంగా శుక్రవారం సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ ఆధ్వర్యంలో జేవీపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం వలన లివర్ వ్యాధి బారినపడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పీఎస్‌వీఎస్ ప్రసాద్, వైద్య సిబ్బంది టి నాగేశ్వరరావు, ఎస్ఎస్‌వీ ప్రకాష్, వై. సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి అభ్యర్థులను గెలిపించాలి'

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 19 : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని పెదరాంభద్రపురం కొత్తూరులో కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు యగదాసు నానాజీ, వేముల వెంకటరమణ, టీడీపీ నేతలు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథ్, చింతకాయల రాంబాబు, మజ్జూరి నారాయణరావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన

సబ్బవరం, ఏప్రిల్ 19: ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా నియంత్రించవచ్చునో ఫైర్ ఆఫీసర్ జీవీ సత్యరాజు ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక పీహెచ్‌సీ, సూర్య ఆసుపత్రిలో శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రమాద సమయంలో రెస్క్యూ టీమ్‌లు రోగులను తరలించు విధానాన్ని వివరించారు. ప్రతి ఆసుపత్రిలో అగ్నిమాపక నియంత్రణ పరికరాలు విధిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది టి వెంకటరావు, పి. అప్పారావు, ఉదయకుమార్, బెన్హర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా అయ్యన్న నామినేషన్

▸ ఇంటి నుంచి కూటమి శ్రేణులతో భారీ ర్యాలీ ▸ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప హాజరు



ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ నామినేషన్ వేసేందుకు వెళుతున్న అయ్యన్న, చిత్రంలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే ముత్యాలపాప

నర్సీపట్నం, ఏప్రిల్ 19 : నర్సీపట్నం నియోజవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఇంటి నుంచి భారీ ర్యాలీగా బయల్దేరారు. జెండాలు, ప్లకార్డులతో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకు సాగారు. పెద్దసంఖ్యలో యువకులు జెండాలు పట్టుకొని బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రచార రథం మీద నుంచి అయ్యన్నపాత్రుడు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. శివపురం, ఐదురోడ్లు కూడలి, కృష్ణాబజార్, అబీద్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 'మీరంతా ఉన్నారన్న నమ్మకం, ధైర్యంతోనే... మీ అందరి సమక్షంలో నామినేషన్ పత్రాలు మీద సంతకం చేస్తున్నాను' అని ప్రకటించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనకాపల్లి ఎంపీ స్థానానికి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్‌కు కమలం గుర్తు మీద ఓటు వేయాలని కోరారు. నేను యద్ధానికి సిద్ధం.. మీరు సిద్ధమా.. అంటూ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడి ఉత్సాహపరిచారు. అనంతరం ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, మాజీ ఎమ్మెల్యే బోళెం ముత్యాలపాప, జాలమూరి బంగార్రాజు తదితరుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి జయరాంకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, జడ్పీటీసీ సుకల రమణమ్మ, చింతకాయల విజయ్, రాజేశ్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగులలో రెండు నామినేషన్లు

మాడుగుల: మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గానికి ఇద్దరు అభ్యర్థులు శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీకి చెందిన పైలా ప్రసాదరావు నామినేషన్ వేశారు. సదరు పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణికి అందజేశారు. అలాగే బీఎస్పీ తరఫున కరణం తిరుపతిరావు నామినేషన్ దాఖలు చేశారు. ఇదిలావుంటే, నామినేషన్ వేసే ముందు పైలా ప్రసాదరావు ర్యాలీగా వస్తూ మాడుగుల బస్టాండ్‌లోప్రసంగించారు. తాను, గవిరెడ్డి రామానాయుడు, పీజీవీ కుమార్ పార్టీ కోసం కష్టపడి పనిచేశామని, తమ ముగ్గురిలో ఎవరికి బి-ఫాం ఇచ్చినా సమ్మతమేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.



ఆర్‌వోకు నామినేషన్‌ను అందిసున్న పైలా

చోడవరంలో రెండో రోజూ నిల్

చోడవరం : ఎన్నికల నామినేషన్ల ఘట్టం ప్రారంభమైనప్పటికీ చోడవరం నియోజకవర్గంలో రెండో రోజు శుక్రవారం కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆర్‌వో చిన్నికృష్ణ ఆధ్వర్యంలో అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేచి ఉన్నప్పటికీ, ఏ ఒక్కరూ నామినేషన్ వేయలేదు ఇదిలావుంటే, నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు 25న నామినేషన్ దాఖలు చేయనున్నారని తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు.

గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల పరిశీలన



చినగొలుగొండపేట పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

నాతవరం, ఏప్రిల్ 19 : మండలంలోని నాలుగు పంచాయతీలలో ఎంపీడీవో జె. రాంబాబు శుక్రవారం పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ముందుగా గొలుగొండపేటలో సచివాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం తాగునీటి ట్యాంక్‌ను పరిశీలించారు. అలాగే చినగొలుగొండపేటలో ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, సౌకర్యాలపై ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌బీపట్నంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. మన్యపురట్లలో పర్యటించి ఎన్నికల నియమావళిపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పంచాయతీల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాలోకి జగన్ బస్సు యాత్ర

... 5వ పేజీ తరువాయి

చేసేందుకు (బస్సులోనే) ఏర్పాట్లు చేశారు.

నేడు గొబ్బూరులో బహిరంగ సభ

▸ చిన్నయ్యపాలెం వద్ద రాత్రి బస

అనకాపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి శనివారం ఉదయం తొమ్మిది గంటలకు నక్కపల్లి మండలం గొడిచెర్ల నుంచి బస్సు యాత్రను కొనసాగిస్తారు. ఉద్దండపురం, నక్కపల్లి, పులపర్తి, రేగుపాలెం, ఎలమంచిలి బైపాస్ మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు అచ్యుతాపురం చేరుకుంటారు. మధ్యాహ్న భోజనం అనంతరం కశింకోట మండలం తాళ్లపాలెం సమీపంలో గొబ్బూరు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఇక్కడ ఏర్పాటు చేసే బహిరంగ సభలో పాల్గొంటారు. తరువాత తాళ్లపాలెం జంక్షన్, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి, శంకరం, రేబాక మీదుగా అనకాపల్లి మండలం చిన్నయ్యపాలెం వద్ద రాత్రి బసకు చేరుకుంటారు.

సింహాచలం దేవస్థానాన్ని ...

... 5వ పేజీ తరువాయి

ఉత్సవంలోగానే చర్యలు తీసుకోవాలని పరోక్షంగా సూచించారు.

- ఈ ఏడాది మే 10వ తేదీన నిర్వహించాల్సిన చందనోత్సవానికి సంబంధించి సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి, దాని తీర్మానాన్ని కలెక్టర్‌కు ఆమోదం కోసం పంపామని ఈఓ కార్యాలయం నుంచి తనకు లేఖ వచ్చిందని, ఏ చట్టం ప్రకారం కలెక్టర్‌కు పంపించారని అశోక్‌గజపతిరాజు ప్రశ్నించారు. ఆయన ఒప్పుకుంటేనే చర్యలు తీసుకోవాలనే నిబంధన ఎక్కడుందని ఆయన నిలదీశారు. దేవస్థానానికి స్వయం ప్రతిపత్తి ఉందని, దానిని తీసుకువెళ్లి కలెక్టర్ చేతిలో ఎలా పెడతారన్నారు. కలెక్టర్ సమయానుకూలంగా మంచి సూచనలు చేస్తే తీసుకోవడంలో తప్పు లేదని, కానీ ఆయన చెప్పేంత వరకు పనులు చేపట్టకుండా కూర్చొంటారా?, ఈలోగా పనులు చేయాల్సిన బాధ్యత మనకు లేదా?...అని ఆయన అడిగారు.

ఏ విషయమన్నా చెబుతున్నారా?

గత ఏడాది చందనోత్సవం వైఫల్యం సమీక్ష నుంచి ఇప్పటివరకు పరిస్థితిలో ఎటువంటి మార్పు రాలేదని అశోక్‌గజపతిరాజు ఆరోపించారు. దేవస్థానానికి కమిటీ వేసినా, వేరే ఏ కార్యక్రమం చేసినా ధర్మకర్తకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం గురించి చెప్పలేదని, అందులో తీసుకున్న నిర్ణయాలు కూడా తనకు తెలియజేయలేదన్నారు. ఇవన్నీ చూస్తుంటే..శ్రీవరహా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం స్వయం ప్రతిపత్తిని, కీర్తిని కావాలనే దెబ్బతీస్తున్నట్టుగా ఉందని, అలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

5 కి.మీ.లు... గంటకుపైగా ప్రయాణం



తుమ్మపాల వద్ద గోతులు ఏర్పడి ఒకవైపు మొత్తం ఛిద్రమైన రోడ్డు

... 5వ పేజీ తరువాయి

అవుతున్నది. వాహనాల టైర్లు, ఇతర విడిభాగాలు దెబ్బతింటున్నాయని యజమానులు వాపోతున్నారు. రాత్రి పూట ప్రయాణించేటప్పుడు దగ్గరకు వెళ్లే వరకు గోతులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ కొద్దిపాటి దూరం ప్రయాణించడానికి గంటకు పైగా సమయం పడుతున్నదని ప్రజలు వాపోతున్నారు. కాగా తుమ్మపాల నుంచి చోడవరం మండలం వెంకన్నపాలెం జంక్షన్ వరకు రహదారిని అభివృద్ధి చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, ఆమ్ ఆద్మీ, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు గతంలో పలుమార్లు ఆందోళనలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వంలో ఎటువంటి చలనం లేదు.

నీటిమూటలుగా మంత్రి అమర్ హామీ



అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రోడ్డును విస్తరించి, శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి చేస్తామని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పలుమార్లు హామీ ఇచ్చారు. మరికొద్ది రోజుల్లో ఆయన పదవీ కాలం ముగుస్తుంది. ఇప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. అనకాపల్లి- చోడవరం రోడ్డు మాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. ఈ రోడ్డులో భారీ గోతులు ఏర్పడడంతో నానా అవస్థలు పడుతున్నాం. గోతుల కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించుకునే క్రమంలో పలువురు ప్రమాదాలబారిన పడ్డారు. ఐదు కిలోమీటర్లు ప్రయాణించడానికి గంటన్నర సమయం పడుతున్నది. ఎన్నికల తరువాత ఏర్పడే ప్రభుత్వం అయినా.. అనకాపల్లి నుంచి వెంకన్నపాలం జంక్షన్ వరకు రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి.

- సందిన చినబాబు, తుమ్మపాల, అనకాపల్లి మండలం

ఆశీర్వదిస్తే చోడవరం నియోజకవర్గం అభివృద్ధి చేసి చూపిస్తా..

▸ కొత్తకోట ప్రచార సభలో అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్



ప్రచార సభలో మాట్లాడుతున్న సీఎం రమేష్, చిత్రంలో కేఎస్ఎన్ఎస్ రాజు

రావికమతం, ఏప్రిల్ 19 : ఎన్నికల్లో తనను గెలిపిస్తే అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న చోడవరం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సీఎం రమేష్ హామీ ఇచ్చారు. శుక్రవారం రాత్రి మండంలోని మేజర్ పంచాయతీ కొత్తకోటలో చోడవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో రోడ్లు అత్యంత దారుణంగా ఉన్నాయన్నారు. తాగునీటి సమస్య తీవ్ర ఉందన్నారు. ఉన్నత విద్య, సాంకేతిక విద్య అందని ద్రాక్షగా మిగిలిందన్నారు. సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా సద్వినియోగం కాక వ్యవసాయరంగం కుదేలయిందని వాపోయారు. కూటమి అభ్యర్థులమైన తమను ఈ ఎన్నికల్లో ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోనే పేరొందిన కొత్తకోట విస్తర్ల పరిశ్రమకు పూర్వవైభవం తెస్తామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, నియోజక వర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, గోవిందరావు, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, బంటు శ్రీను, వెల్లంకి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

మేజర్ పంచాయతీ కొత్తకోటలో వైసీపీ నుంచి ఇరవై మంది శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి చోడవరం నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ తరఫున ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉన్న కేఎస్ ఎన్ఎస్ రాజు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, నాయకులు కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, వెల్లంకి ఈశ్వరావు, కోట దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు భరోసాతోనే పోటీకి సిద్ధం



చీడికాడలో టీడీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న బండారు

▸ 22న నామినేషన్ దాఖలు

▸ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

చీడికాడ, ఏప్రిల్ 19 : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు భరోసాతోనే మాడుగుల నియోజకవర్గం ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధమయ్యానని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. చీడికాడలోని బొడ్డు వరహామూర్తి కళ్లాల వద్ద శుక్రవారం రాత్రి జరిగి పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో మాడుగుల నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఇక్కడి ఎమ్మెల్యేగా ఉన్న బూడి సద్వినియోగం చేసుకుని, తద్వారా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడంలో విఫలమయ్యారని ఆరోపించారు. వచ్చే నెల జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా అనకాపల్లి ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యేగా పోటీ చేయనున్న తనను ఆశీర్వదించి, అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. అలాగే ఈనెల 22వ తేదీన మాడుగులలో తాను నామినేషన్ వేయనున్నట్టు ప్రకటించారు. పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు తరలి రావాల్సిందిగా కోరారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానా యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి పీజీవీ కుమార్, సీఎం రమేష్ సోదరుడు మహేష్, టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, పోతల రమణమ్మ, గండి ముసలినాయుడు, బొబ్బాది తాతారావు, పంచాడ దాలెంనాయుడు, పేరపు కొండబాబు పాల్గొన్నారు.

కె.కోటపాడు : రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థుల విజయంతోనే సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని గొట్లాం, శృంగవరం, మర్రివలస, పాతవలస, సూదివలస గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు మహేష్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, నాయకులు కన్నూరు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

'కూటమితోనే జిల్లా సర్వతోముఖాభివృద్ధి'



బంగారుమెట్టలో ప్రచారం చేస్తున్న శ్రీదేవి

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 19 : జిల్లా సర్వతోముఖాభివృద్ధి కూటమి అభ్యర్థుల విజయంతోనే సాధ్యమని అనకాపల్లి ఎంపీ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె బంగారుమెట్ట, ఎల్‌బీపీ అగ్రహారం, చినప్పన్నపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. ప్రధానంగా అనకాపల్లి జిల్లా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చేయడానికి పనులు లేక ఉపాధి కరువై జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని వాపోయారు. అనకాపల్లి ఎంపీగా సీఎం రమేష్‌ను గెలిపిస్తే మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు జిల్లాను పారిశ్రామింగా అభివృద్ధి చేస్తారన్నారు. కాగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన పి.భీమవరానికి చెందిన ఆర్మీ జవాన్ పడాల వరహాలు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఆమె వెంట బీజేపీ రాష్ట్ర నాయకులు ఈర్లె శ్రీరామూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు సీతా నాగరాజు, టీడీపీ నాయకులు తమరాన దాసు, సాయం శేషు తదితరులు ఉన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు 'బత్తుల'కు సన్మానం



తాతయ్యబాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రోలుగుంట, ఏప్రిల్ 19 : టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా మండలానికి వచ్చిన బత్తుల తాతయ్యబాబును ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల శాఖ అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చిరంజీవి తదితరుల ఆధ్వర్యంలో స్థానిక పాలకేంద్రం వద్ద సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే అందరి లక్ష్యం కావాలన్నారు.

శివయ్య కల్యాణోత్సవాలు ప్రారంభం

నక్కపల్లి, ఏప్రిల్ 19: మండలంలోని ఉపమాక శివాలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ అర్చకులు మహేశ్, సంతోశ్, పండుశర్మ, భగవాన్‌శర్మ తదితరులు పుణ్యాహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పల్లకీలో పార్వతీదేవి, సప్పరం వాహనంపై శివయ్య ఉత్సవమూర్తులను అలంకరించి, నక్కపల్లిలో షైలవరపు భట్ల జోగారావు ఇంటి వద్ద ఎదురుసన్నాహ మహోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితురాలు డాక్టర్ గాయత్రీదేవి ఎంతో అద్భుతంగా ఆది దంపతుల పెండ్లిచూపులు, పెండ్లిమాటలు గురించి తెలియజేశారు. ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు నేతృత్వంలో కల్యాణోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

చినపాచిలలో ఘనంగా సీతారాముల కల్యాణం

▸ ఏటా భద్రాద్రిలో జరిగిన అనంతరం మూడో రోజు ఇక్కడ నిర్వహణ

▸ పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తజనం ▸ భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు



చినపాచిలలో సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకస్వాములు

రావికమతం, ఏప్రిల్ 19 : మండలంలోని చినపాచిల గ్రామంలో గల కోదండ రామాలయంలో సీతారాములు, లక్ష్మీసత్యనారాయణ స్వామివార్ల కల్యాణం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఏటా భద్రాద్రి రాముని కల్యాణం అనంతరం మూడో రోజున ఏకాదశినాడు ఇక్కడ ఈ వేడుక జరుపుతుండడం ఆనవాయితీ. నూటపదేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఆ ఆలయంలో ఏటా సాసుబిల్లి వారి వంశీకులు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు ఆరవెల్లి వాసు దేవాచార్యులు, వెంకట రామగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల లీలా దివ్య కల్యాణాన్ని ఘనంగా జరుపుతుంటారు. ఈ వేడుకను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. అలాగే రావికమతం కంచిపాటి వారి దేవాలయంలోనూ సీతారాముల కల్యాణాన్ని పురోహితులు అంగరంగవైభవంగా జరిపించారు. మధ్యాహ్నం జగన్నాథరావు ఆధ్వర్యంలో ఇక్కడ అన్నసమారాధన ఏర్పాటైంది.

'కొండపైనున్న గిరిజనులు ఓట్లు వేసేందుకు రవాణా ఏర్పాట్లు'



లోసింగిలో గిరిజనులతో సమావేశమైన నోడల్ అధికారి

రోలుగుంట, ఏప్రిల్ 19 : వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు గాను కొండపై నుంచి గిరిజనులను కిందకు దించి, తిరిగి వారిని మరలా చేరవేసేందుకు వాహనాలు ఏర్పాటు చేస్తామని మండల నోడల్ అధికారి అల్లు సూర్యనారాయణ తెలిపారు. నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ చిన్నికృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన లోసింగి, పెదగరువు, కొత్తలోసింగి గ్రామాలను సందర్శించారు. రవాణా మార్గాలను అన్వేషించి, ఆయా గ్రామాల వారితో సమావేశమయ్యారు. ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు కొండపై నుంచి దిగువకు రవాణా కష్టాలు లేకుండా పోలింగ్ బూత్ ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశంపై వారితో చర్చించారు. ఎప్పటిలాగే శరభవరం పోలింగ్ బూత్‌లోనే ఓటు వేస్తామని, దానికి అనుగుణంగా రవాణా సౌకర్యం కల్పించాల్సిందిగా వారు కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ వాహనాలను ఏర్పాటు చేసి కొండపై నుంచి దిగువకు తెచ్చి, ఓటు వేసిన అనంతరం తర్వాత తిరిగి గ్రామాలకు చేర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గిరిజనులు పాల్గొన్నారు.

సైనిక లాంఛనాలతో ఆర్మీ ఉద్యోగి అంత్య క్రియలు

▸ పి.భీమవరంలో నిర్వహణ



పడాల వరహాలు(ఫైల్)

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 19 : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్మీ ఉద్యోగి పడాల వరహాలబాబుకు శుక్రవారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ నెల 16వ తేదీన తన స్వగ్రామమైన పి.భీమవరం నుంచి దేవరాపల్లి మండలం వాకపల్లి గ్రామానికి బైక్‌పై వరహాలబాబు వెళుతుండగా, పెదగోగాడ రోడ్డులో అదుపుతప్పి మృతి చెందిన విషయం విధితమే. శుక్రవారం పి.భీమవరా నికి అతని మృతదేహం చేరుకుంది. ఆర్మీ అధికారులు విచ్చేసి తొలుత నివాళులర్పించారు. అనంతరం గౌరవ వందనం సమర్పించారు. వరహాలుబాబు సతీమణి తులసికి జాతీయ జెండాను అందించారు. అంతిమ యాత్రలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వరహాలుబాబుకి గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

పేటమాలపల్లిలో తాగునీటి కష్టాలు

▸ గ్రామంలో ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో సమస్య



శిథిలావస్థకు చేరిన ట్యాంకు

గొలుగొండ, ఏప్రిల్ 19 : మండల కేంద్రం గొలుగొండ పంచాయతీ శివారు పేట మాలపల్లిని రెండు నెలలుగా తాగు నీటి కష్టలు వెంటాడుతున్నాయి. ఈ దళిత కాలనీలో రక్షిత తాగునీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో దానికి నీటిని అం దించకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ఇక్కడ సుమారు వంద కుటుంబాలవారు నివాసం ఉంటున్నారు. వీరి తాగునీటి అవసరాలకు టీడీపీ ప్రభుత్వ హయాంలో బోరుతో పాటు, ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో రెండు నెలల నుంచి ఆ ట్యాంకుకు నీరు అందించడం మానేశారు. ఫలితంగా ఇంటింటికీ తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో అక్కడివారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే వేసవి కాలం కావడంతో నీటి కష్టాలు ఎదుర్కొంటున్నామని మహిళలు వాపోయారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా తమ తాగునీటి సమస్యను తీర్చాల్సిందిగా కోరుతున్నారు.

'విత్తనాల ఎంపికలో సూచనలు పాటించాలి'



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీన్ భరతలక్ష్మి

చీడికాడ, ఏప్రిల్ 19: విత్తనాల ఎంపికలో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.ఎం.భరతలక్ష్మి అన్నారు. మండలంలోని చెట్టుపల్లిలో రైతులతో, వ్యవసాయ కళాశాల విద్యార్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగుచేసే రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు, తెగుళ్ల సోకకుండా ఉండేందుకు ఎంటీయూ 1156, ఎంటీయూ 1224, ఆర్ఎస్ఆర్ 15048 రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కొండెపూడి కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజ్‌కుమార్, వ్యవసాయశాస్త్రవేత్తలు రమేష్‌బాబు, కిశోర్, మాజీ సర్పంచ్ పాతాళం చిన్నంనాయుడు, నైరా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.